TEL:T/TG/2024/0814

# మన వెలుగు

ప్రతి వార్త ప్రజల వైపు   తెలుగు దినపత్రిక

MANA VELUGU TELUGU DAILY

విలేఖరులు కావలెను...

మన వెలుగు తెలుగు దినపత్రికకు
ఆంధ్రప్రదేశ్, తెలంగాణ లోని అన్ని జిల్లాల వారిగా స్టాఫ్ రిపోర్టర్లు
మరియు నియోజకవర్గ,మండలవారిగా విలేఖరులు కావలెను,
తెలుగు భాష మీద కనీస అవగాహన కలిగివుండి, వార్తలు
రాయగలిగిన వారికి ప్రాధాన్యత ఇవ్వబడును..
మరిన్ని వివరాలకు సంప్రదించండి...

నెట్ వర్క్ ఇంచార్జి సెల్ : 9533397954

పబ్లిషర్ : హైదరాబాద్ సంపుటి :01 సంచిక : 180 శనివారం 22-02-2025 పేజీలు : 06 వేల : 05/-

# సంక్షేమమే ప్రజా ప్రభుత్వం లక్ష్యం

- 3,000 కోట్ల బడ్జెట్ తో ఎస్సీ, ఎస్టీలకు స్వయం ఉపాధి పథకాలు 2 నెలల్లో అమలు చేయాలి
- అద్దెలు, డైట్ చార్జిలు పెండింగ్లో పెట్టవద్దు
- అటవీ భూముల అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేయండి



**హైదరాబాద్ (మన వెలుగు) ఫిబ్రవరి 21:** ప్రజా ప్రతినిధులు, సీనియర్ అధికారులు హాస్టల్లో పర్యటన నిరంతరం కొనసాగేలా ప్రయత్నించండి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ శాఖల ప్రీ బడ్జెట్ సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు సంక్షేమమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం.. సంక్షేమ శాఖలో పథకాల అమలుకు ఎన్ని నిధులైన ఖర్చు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. శుక్రవారం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సచివాలయంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, సంక్షేమ శాఖల ప్రీ బడ్జెట్ సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పలు అంశాల పై సమీక్ష నిర్వహించారు.గత దశాబ్ద కాలంగా పాలించిన వారుఎస్సీ, ఎస్టీ యువతకు స్వయం ఉపాధి పథకాలు పూర్తిగా పక్కన పెట్టారు. 3,000 కోట్ల బడ్జెట్ తో ఎస్సీ, ఎస్టీ యువతకు రెండు నెలల వ్యవధిలో స్వయం ఉపాధి పథకాలు అందించాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అధికారులను కోరారు. ఈ భారీ ఉపాధి పథకాలకు సంబంధించిన ప్రణాళికలను వేను వెంటనే సిద్ధం చేయాలని సంబంధిత శాఖ అధికారులు అందరినీ ఆదేశించారు. సంక్షేమ హాస్టల్లు, రెసిడెన్షియల్ పాఠశాలలు, గురుకులాలకు సంబంధించి అద్దెలు, డైట్ బిల్లులు ఎప్పటికప్పుడు చెల్లించాలని డిప్యూటీ సీఎం అధికారులకు సూచించారు. శాఖల వారీగా ఈ అంశాల్లో ఉన్న బకాయిల వివరాలు అడిగి తెలుసుకున్నారు. బకాయిలకు సంబంధించి శాఖల అధికారులు బాధ్యత తీసుకొని ఆర్థిక శాఖ నుంచి బిల్లులు ఎప్పటికప్పుడు మంజూరు చేయించుకోవాలని సూచించారు. మంత్రులు, ఎమ్మెల్యేలు, సీనియర్ అధికారులు సంక్షేమ హాస్టలు, గురుకులాల్లో పర్యటన కార్యక్రమం నిరంతరం కొనసాగేలా సంక్షేమ శాఖ అధికారులు ఫాలో అప్ చేసుకోవాలని సూచించారు. పర్యటనలకు సంబంధించిన షెడ్యూల్ను సంక్షేమ శాఖల అధికారులు నిత్యం ప్రజా ప్రతినిధులు, సీనియర్ అధికారులకు గుర్తుచేసి కార్యక్రమం విజయవంతంగా ముందుకు తీసుకువెళ్లాలని తెలిపారు. సబ్ ప్లాన్ చట్టం ప్రకారం వివిధ శాఖల నుంచి ఎస్సీ, ఎస్టీ శాఖలకు రావలసిన నిధులపై కసరత్తు చేసి సీరియస్ గా ఫాలోఅప్ చేయాలని తెలిపారు. కేంద్ర పథకాలకు సంబంధించి ఎప్పటికప్పుడు యుటిలైజేషన్ సర్టిఫికెట్లు సమర్పించి నిధులు రాబట్టడంలో వేగం పెంచాలని కోరారు. ఆదిలాబాద్ నుంచి భద్రాచలం వరకు అటవీ హక్కుల చట్టం కింద లక్షలాది మంది గిరిజనులకు భూ పంపిణీ జరిగిందని డిప్యూటీ సీఎం తెలిపారు. ఈ భూముల అభివృద్ధికి ఎస్సీ ,ఎస్టీ శాఖల అధికారులు విద్యుత్తు, వ్యవసాయ, అటవీ, ఉద్యాన శాఖ అధికారులతో సంయుక్తంగా సమావేశాలు నిర్వహించాలని ఆదేశించారు. ఈ భూముల్లో సోలార్ పవర్ ఆధారంగా సాగు విస్తీర్ణాన్ని పెంచడం, అటవీ విస్తీర్ణాన్ని పెంచేందుకు అవకాడో, వెదురు వంటి పంటల సాగుకు ప్రణాళికలు రచించి రాబోయే రెండు సంవత్సరాల్లో ఫలితాలు అందేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని కోరారు. ఎస్సీ, ఎస్టీ ఆవాసాల్లో నిరుపయోగంగా ఉన్న ఎత్తిపోతల పథకాలకు మరమ్మతులు చేపట్టి ఆ వర్గాల ఆదాయం పెంచేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు. సంక్షేమ శాఖ అధికారులు ఆయా వర్గాల శ్రేయస్సును దృష్టిలో పెట్టుకొని ఏ సూచన చేసిన అమలు చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని డిప్యూటీ సీఎం భరోసా ఇచ్చారు. సమావేశంలో స్పెషల్ చీఫ్ సెక్రటరీ రామకృష్ణారావు, ఎస్సీ కార్పొరేషన్ ప్రిన్సిపల్ సెక్రెటరీ శ్రీధర్, ఎస్టీ కార్పొరేషన్ ప్రిన్సిపల్ సెక్రెటరీ శరత్, డిప్యూటీ సీఎం స్పెషల్ సెక్రటరీ కృష్ణ భాస్కర్, ఆర్థిక శాఖ జాయింట్ సెక్రెటరీ హరిత, ఇరిగేషన్ సెక్రటరీ పాటిల్ తదితరులు పాల్గొన్నారు.

# రైతుల పట్ల ఇదేనా మీ చిత్తశుద్ధి



**అమరావతి ఫిబ్రవరి 21 :** రైతుల పట్ల ఇదేనా మీ చిత్తశుద్ధి అని ఎపి ముఖ్యమంత్రి చంద్రబాబుపై వైసిపి నేత జగన్ మోహన్ రెడ్డి మండిపడ్డారు. చంద్రబాబు తీరుపై వైఎస్ జగన్ ధ్వజమెత్తారు. ఈ సందర్భంగా జగన్ మాట్లాడారు. తమ లేఖలోనే మిర్చి గరిష్ట ధర రూ. 27 వేలు పలికిందని చెప్పారు. నాడు పెట్టుబడి ఖర్చులకు రూ. లక్ష.. నేడు లక్షన్నర అని విమర్శించారు. ధరలు పడిపోవడంతో ప్రతి రైతు రూ. లక్షకు పైగా నష్టం జరుగుతుందని తెలియజేశారు. రైతుల కోసం కొత్త మద్దతు ధరలు ఎందుకు ప్రకటించలేదని జగన్ ప్రశ్నించారు. పత్తి, పెసర, మినుము, కంది, టమోటా, మిర్చి, ధాన్యం సహా పలు పంటలకు మద్దతు ధర రావడం లేదని దుయ్యబట్టారు.రాష్ట్ర ప్రభుత్వమే ఎందుకు కొనుగోలు చేయడం లేదని, మీ చేతిలో ఉన్న మార్క్ ఫెడ్ ద్వారా కొనుగోలు చేయకుండా%ా% కేంద్రానికి లేఖలు రాయడంపై రైతులను మోసం చేయడం కాదా?అని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్రంపై ఆధారపడకుండా మార్క్ ఫెడ్ ద్వారా మిర్చిని కొనాలని చెప్పారు. తాను మిర్చి రైతులను కలుసుకుంటే ఎన్నికల కోడ్ అడ్డు వచ్చిందా?నని అన్నారు. రైతులకు బాసటగా వెళ్లినందుకు మాపై కేసులు పెడతారా? నని ఫిబ్రవరి 15న మీ మ్యూజికల్ నైట్ కోడ్ అడ్డం రాలేదా?నని వైఎస్ జగన్ దుయ్యబట్టారు. అన్యాయంగా తమపై కేసులు ఎలా పెడుతారని, ఇది అప్రజాస్వామికం కాదా? అని ప్రశ్నించారు. గురువారం జరిగిన కార్యక్రమంలో పలానా వారికి ఓటు వేయమని కూడా చెప్పలేదన్నారు. తాము ఎన్నికల్లో పోటీ చేయడం లేదని స్పష్టం చేశారు.

# పేదలు, వృద్ధులను కాంగ్రెస్ ప్రభుత్వం వంచిస్తోంది

**హైదరాబాద్ ఫిబ్రవరి 21:** తెలంగాణలో ఆయుష్మాన్ భారత్ అమలు చేయడంలేదని బిజెపి ఎంపి పురంధేశ్వరి తెలిపారు. కరీంనగర్ లో ఎంపి దగ్గుబాటి పురంధేశ్వరి పర్యటించిన సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడారు. పేదలు, వృద్ధులను కాంగ్రెస్ ప్రభుత్వం వంచిస్తోందని విమర్శలు గుప్పించారు. బిసిల్లో ముస్లింలను చేర్చడాన్ని తెలంగాణ ప్రభుత్వం ఆలోచించి, ప్రణాళికలు జరపాలని సూచించారు. ప్రధాని నరేంద్ర మోడీ కులంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యాఖ్యలు సరికాదని చురకలంటించారు. బిసిలను అవమానపరిచేలా రేవంత్ మాట్లాడారని పురంధేశ్వరి ధ్వజమెత్తారు.



## కాలుష్య రహిత భారత్ కోసం కీలక ఖనిజాల ఉత్పత్తి అత్యవసరం

**సింగరేణి భవన్, ఫిబ్రవరి 21,** 2025 బ్యాటరీ వాహనాలు, సోలార్ విద్యుత్తు వినియోగం క్రమంగా పెరుగుతున్న నేపథ్యంలో లిథియం, కోబాల్ట్, నికెల్ వంటి కీలకఖనిజాలకు అనూహ్య డిమాండ్ ఏర్పడుతోందని, ఈ విషయంలో భారత్ స్వయంసమృద్ధి సాధించడానికి ప్రభుత్వరంగ సంస్థలు కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని సింగరేణి సంస్థ చైర్మన్ మరియు ఎండీ శ్రీ ఎన్.బలరామ్ అభిప్రాయపడ్డారు. హైదరాబాద్ లో శుక్రవారం కీలక ఖనిజాలపై క్రిటికల్ మినరల్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయస్థాయి సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. 2070 నాటికి భారత్ ను కర్బన ఉద్గార రహిత " నెట్ జీరో " దేశంగా మార్చాలని లక్ష్యంగా పెట్టుకున్నామని, ఇది నెరవేరాలంటే దేశీయ ఖనిజ పరిశ్రమల వారు క్రిటికల్ మినరల్స్ (కీలక ఖనిజాల) ఉత్పత్తి పై ప్రత్యేక దృష్టి సారించాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. కీలక ఖనిజాల పై పరిశోధన, అన్వేషణ, ఉత్పత్తి వంటి విషయాలలో ప్రభుత్వ సంస్థల మధ్య సమన్వయం, సహకారం ఎంతో అవసరం అన్నారు. ఎలక్ట్రానిక్స్ రంగం, సాంప్రదాయేతర ఇంధన వనరుల రంగం, విద్యుత్ వాహనాలు, రక్షణ రంగాల్లో కీలక ఖనిజాల వినియోగం ఎంతో ఎక్కువగా ఉందని, ప్రస్తుతం ఈ ఖనిజాలను విదేశాలనుంచే ఎక్కువ శాతం దిగుమతి చేసుకుంటున్నామన్నారు. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం వారు 30 రకాల కీలక ఖనిజాల జాబితాని విడుదల చేశారని, వీటిని దేశీయంగా ఉత్పత్తి చేయడం కోసం, తద్వారా స్వయం సమృద్ధి సాధనకు పరిశ్రమలు కృషి చేయాలని పిలుపునిచ్చారని గుర్తుచేశారు. కనుక పెద్ద ఎత్తున పెరుగుతున్న డిమాండ్ కు తగ్గట్టుగా కీలక ఖనిజాలను దేశీయంగా ఉత్పత్తి చేయటం ఎంతో అవసరమని,ఈ సవాలను ఒక అవకాశంగా దేశీయ పరిశ్రమలు తీసుకోవలసి ఉంటుందన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సూచన మేరకు సింగరేణి సంస్థ కూడా కీలక ఖనిజ పరిశ్రమ రంగంలోనికి అడుగుపెట్టడానికి సంసిద్ధమయిందని పేర్కొన్నారు. సింగరేణి ఇప్పటికే ఈ విషయంలో ముందడుగు వేసి, జనవరి మొదటి వారంలో ఐఐటి హైదరాబాద్ వారితో ఒప్పందం కుదుర్చుకుందన్నారు. సింగరేణి థర్మల్ విద్యుత్ కేంద్రం నుండి విడుదలయ్యే ఫ్లై యాష్, క్లే మరియు ఓపెన్ కాస్ట్ గనుల ఓవర్ బర్డెన్ నుండి రేర్ ఎర్త్ ఎలిమెంట్స్ ను వెలికి తీసే అంశంపై పరిశోధనలు ప్రారంభమయ్యాయని పేర్కొన్నారు.. ఇకముందు సింగరేణి సంస్థ కేవలం బొగ్గు తవ్వకానికే పరిమితం కాకుండా కీలక ఖనిజాల అన్వేషణ మరియు ఉత్పత్తి రంగాల్లో కూడా అడుగు పెట్టనుందని తెలియజేశారు. సంస్థ తన వ్యాపార విస్తరణ కార్యక్రమంలో భాగంగా ఈ చర్యలు చేపడుతున్నప్పటికీ కీలక ఖనిజాల విషయంలో దేశీయ స్వయంసమృద్ధికి ఇది ఉడతాభక్తిని దోహదపడుతుందని భావిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.ఈ సదస్సులో ఐఐటీ హైదరాబాద్ డైరెక్టర్ డాక్టర్ బి.ఎస్.మూర్తి, సింగరేణి ఈడీ కోల్ మూమెంట్, జీ.ఎం కో-ఆర్డినేషన్ శ్రీ ఎస్. డి.ఎం.సుభాని, క్రిటికల్ మినరల్స్ అసోసియేషన్ ఇండియా అధ్యక్షుడు డాక్టర్ చైతన్యమొయి గంగూలీ, మేనేజింగ్ డైరెక్టర్ శ్రీ సందీప్ హామిల్టన్, సింగరేణి జీ.ఎం లు శ్రీ మనోహర్, నారాయణరావు, మిథానీ, న్యూక్లియర్ ఫ్యూయల్ కార్పోరేషన్, వేదంతా తదితర కంపెనీల అధికారులు, ఐ.ఐ.టి సంస్థల ఉన్నత అధికారులు పాల్గొన్నారు.

## ఐ ప్యాక్ డ్రామాలను ప్రజలు, ఛీ కొడుతున్నారు

**అమరావతి ఫిబ్రవరి 21 :** తన తప్పులను ప్రశ్నిస్తామనే వైసిపి అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై అసెంబ్లీకి రావడం లేదని మంత్రి కొల్లు రవీంద్ర సంచలన ఆరోపణలు చేశారు. ఐ ప్యాక్ డ్రామాలను ప్రజలు నమ్మరని, ఛీ కొడుతున్నారని విమర్శించారు. గుడివాడ టిడిపి కార్యాలయంలో మీడియా సమావేశంలో మంత్రి మాట్లాడుతూ కిడ్నాప్ చేస్తే కేసులు పెట్టక ఏం చేస్తారని ప్రశ్నించారు. ప్రజలు రోడ్డు మీద నిలబెట్టినా జగన్ ప్రవర్తనలో మార్పు లేదని మండిపడ్డారు. రాజకీయ స్వార్థానికే జగన్ మిర్చి యార్డుకు వెళ్లారని కొల్లు రవీంద్ర పేర్కొన్నారు.

TEL:T/TG/2024/0814
మన వెలుగు
ప్రతి వార్త ప్రజల వైపు తెలుగు దినపత్రిక
MANA VELUGU TELUGU DAILY



# ఎవరినో గెలిపించేందుకు బైడెన్ ప్రయత్నం



**న్యూయార్క్ :** 'ఓటర్ టర్నవుట్' కోసం భారత్‌కు 21 మిలియన్ల డాలర్లను కేటాయించాలని గత బైడెన్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి ప్రశ్నించారు. 'బహుశా మరెవరినో గెలిపించేందుకు వారు ప్రయత్నించినట్లు వుంది.' అని ట్రంప్ వ్యాఖ్యానించారు. మియామిలో ఎఫ్ఐఐ ప్రాధాన్యతా సదస్సులో మాట్లాడుతూ ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారు. ఇప్పటికే ట్రంప్ అంశంపై ఆందోళనలు వ్యక్తం చేశారు. అటువంటి ఆర్థిక సాయం భారత్‌కు చేయాల్సిన అవసర మేమంటని ప్రశ్నించారు. భారత ఎన్నికల్లో ఓటు వేసే ఓటర్ల సంఖ్యను పెంచేందుకు అమెరికా సాయం చేయాల్సిన అవసరాన్ని ఆయన బుధవారం కూడా ప్రశ్నించారు. భారత్‌లో ఓటర్ల శాతాన్ని పెంచేందుకు ఎన్నికల కమిషన్‌కు యుఎస్ఎయిడ్ 21 మిలియన్ల డాలర్లను అందచేసిందని ఎలన్ మస్క్ నేతృత్వంలోని డోజ్ విభాగం వెల్లడించింది. ఆ నేపథ్యంలో ట్రంప్ పై విధంగా స్పందించారు. ఎఫ్ఐఐ సదస్సులో ట్రంప్ మాట్లాడుతూ, తాను అధ్యక్షుడిని కాకముందు ప్రజల డబ్బు అంతా ఎక్కడకు పోతోందో కొన్ని ఉదాహరణలు వివరించారు. "21 మిలియన్ల డాలర్లు భారత్‌కు వెళ్ళాయి. అసలు భారత్‌లో మనం ఇంత మొత్తం ఖర్చు పెట్టాల్సిన అవసరమేముంది? బంగ్లాదేశ్‌లో రాజకీయ పరిస్థితులను బలోపేతం చేసేందుకు 29 మిలియన్ల డాలర్లు అందచేశారు. ..నేపాల్‌లో జీవ వైవిధ్య పరిక్షణ కోసం 10మిలియన్ల డాలర్లు ఇచ్చారు. ఆసియా దేశాల పరిస్థితి బాగానే వుంది. వారికి మనం డబ్బు ఇవ్వాల్సిన అవసరం లేదు." అని ట్రంప్ పేర్కొన్నారు. ఇవి కొన్ని ఉదాహరణలు మాత్రమేనని, ఇలాంటి జాబితా సుదీర్ఘంగా వుందన్నారు. ఏఏ అంశాలపై అమెరికా పన్నుదారుల డబ్బు ఖర్చు చేస్తున్నారో వివరిస్తూ ఫిబ్రవరి 16న డోజ్ ఒక జాబితా ఇచ్చింది. అందులో భారత్‌కు ఇచ్చిన మొత్తం గురించి వుంది. ఆ జాబితాలోని అంశాలన్నింటినీ రద్దు చేసామని డోజ్ తెలిపింది. ప్రపంచవ్యాప్తంగా యుఎస్ఎయిడ్ చేపట్టే మానవతా సాయాన్ని నిలిపివేస్తూ ఈ నెల 7న డోజ్ ఆదేశాలు జారీ చేసింది.

# ఎఫ్‌బీఐ డైరెక్టర్‌గా కాష్ పటేల్

చరిత్రలో తొలిసారిగా, అమెరికా కేంద్ర దర్యాప్తు సంస్థ (ఎఫ్‌బీఐ)కి భారత సంతతికి చెందిన వ్యక్తి నేతృత్వం వహించబోతున్నారు. కాష్యప్ 'కాష్' పటేల్ ఇప్పుడు ఎఫ్‌బీఐ డైరెక్టర్‌గా నియమితులయ్యారు. అమెరికా సెనెట్ 51-49 ఓట్ల తేడాతో ఆయన నియామకాన్ని ఆమోదించింది. రిపబ్లికన్ పార్టీ సెనెటర్లు పెద్ద ఎత్తున ఆయనకు మద్దతు తెలిపారు, కానీ డెమొక్రటిక్ పార్టీ సెనేటర్లు సుసన్ కోలిన్స్, లిసా ముర్కోవ్స్కీ మాత్రం ఆయనకు వ్యతిరేకంగా ఓటు వేశారు. ఈ నేపథ్యంలో, పటేల్ మాట్లాడుతూ, ఎఫ్‌బీఐ రాజకీయాలకు అతీతంగా పనిచేస్తుందని, రాజకీయ ప్రత్యర్థులపై ప్రతీకార చర్యలు ఎవరూ తీసుకోబోరు అని హామీ ఇచ్చారు. ఆయన లక్ష్యం ఎఫ్‌బీఐపై ప్రజల్లో నమ్మకాన్ని మరింత పెంచడమేనని చెప్పారు. "అమెరికాకు హానిచేస్తే, ఎక్కడ ఉన్నా వేటాడి, వారిని మట్టుపెట్టే ధీమా" అని ఆయన హెచ్చరించారు. కాష్ పటేల్ అమెరికాలో డొనాల్డ్ ట్రంప్‌కు అత్యంత విశ్వసనీయుడిగా భావించబడతారు. ట్రంప్ అధికారంలోకి వచ్చిన తర్వాత, ప్రభుత్వ శాఖల్లో కీలక మార్పులు చోటుచేసుకుంటున్నాయి. ప్రత్యేకంగా న్యాయశాఖ, ఎఫ్‌బీఐలో, ట్రంప్ పాలనలో సుమారు 75 మంది లాయర్లు, ఇతర అధికారులు రాజీనామా చేశారు. కొన్ని చోట్ల, ట్రంప్ ప్రభుత్వం స్వయంగా వారి పదవులను తొలగించింది, మరికొందరిని ఇతర విభాగాలకు బదిలీ చేసింది. ఈ స్థాయిలో మార్పులు చోటుచేసుకోవడం, అక్కడి రాజకీయ వర్గాల్లో కలకలం రేపింది.

# అమెరికాలో మళ్లీ ఢీకొన్న విమానాలు..

మరోసారి అమెరికాలో విమాన ప్రమాదం సంభవించింది. ఆరిజోనా రాష్ట్రంలోని మరానా రీజినల్ ఎయిర్‌పోర్టులో రెండు చిన్న విమానాలు ఢీకొన్నాయి. ఈ ఘటనలో ఇద్దరు మరణించినట్లు యునైటెడ్ స్టేట్స్ ఫెడరల్ ఏవియేషన్ అడ్మినిస్ట్రేషన్ (ఎఫ్ఏఏ) ప్రమాదంతో మంటలు చెలరేగి భారీగా పొగలు వచ్చాయి. ఇటీవల ఒక విమానం ఒక హెలికాప్టర్ ఢీకొన్న ఘటనలో 67 మంది మరణించిన కొన్ని వారాల వ్యవధిలోనే తాజా ఘటన జరగడం ఆందోళనకు గురిచేస్తోంది. కాగా, అరిజోనా రాష్ట్రంలోని టక్సన్ అంతర్జాతీయ విమానాశ్రయానికి వాయవ్యంగా 30 మైళ్ల దూరంలో ఈ ప్రమాదం జరిగింది. రెండు సింగిల్ ఇంజిన్ విమానాలు గాల్లో ఢీకొన్నాయి. ఈ మేరకు ఎఫ్ఏఏ తన అధికారిక వెబ్?సైట్?లో వివరాలను వెల్లడించింది. అయితే గాల్లో ఢీకొన్న అనంతరం ఒక విమానం సురక్షితంగా ల్యాండ్ కాగా, మరో విమానం రన్?వే సమీపంలో భూమి మీద క్రాష్ అయ్యింది. ఆ వెంటనే ఆ విమానంలో మంటలు చెలరేగాయి. ప్రమాదానికి గురైన రెండు విమానాలను అమెరికా నేషనల్ ట్రాన్స్‌పోర్టేషన్ సేఫ్టీ బోర్డు (ఎన్‌టీఎస్‌బీ) గుర్తించింది. అవి లాన్ షైర్ 360 ఎంకే 2 విమానం, సెస్నా 172 ఎస్ ఎయిర్‌క్రాఫ్ట్. సెస్నా సురక్షితంగా ల్యాండ్ అయిందని, లాన్?షైర్ కిందపడటంతో మంటలు చెలరేగాయని తెలిపింది. విమాన ప్రమాదంలో ఇద్దరు మృతి చెందినట్లు మరానా పోలీస్ డిపార్ట్?మెంట్ ధృవీకరించింది.

# నైతిక విలువలు పాటించండి

**న్యూఢిల్లీ :** ఐటీ రూల్స్‌లోని (2021) కోడ్ ఆఫ్ ఎథిక్స్‌ను ఓటిటిలు, సామాజిక మాధ్యమాలు తప్పనిసరిగా పాటించాలని కేంద్రం హెచ్చరించింది. చిన్నారులకు 'ఏ' రేటెడ్ కంటెంట్ అందుబాటులో లేకుండా చూడాలని ఆదేశించింది. సమాచార, ప్రసార మంత్రిత్వశాఖ గురువారం ఈ మేరకు ఓ ప్రకటనను విడుదల చేసింది. 'ఓటీటీ ప్లాట్‌ఫామ్‌లు, సోషల్ మీడియాలోని అశ్లీల, అసభ్యకరమైన కంటెంట్‌లపై ఫిర్యాదులు అందాయి. ఐటీ రూల్స్‌లోని (2021) కోడ్ ఆఫ్ ఎథిక్స్‌ను సామాజిక మాధ్యమాలు, ఓటిటి ప్లాట్‌ఫామ్‌లు తప్పనిసరిగా పాటించాలి. ఈ నిబంధనలు ఉల్లంఘించే ఏ కంటెంట్‌ను ప్రసారం చేయకూడదు. వయస్సు ఆధారిత కంటెంట్ అందుబాటులో ఉండాలి. స్వీయ నియంత్రణ కలిగిన ఓటీటీలు నైతిక విలువలను పాటించాలి' అని ఆ ప్రకటనలో పేర్కొంది. ఇటీవల 'ఇండియాస్ గాట్ లాటెంట్' కార్యక్రమంలో యూట్యూబర్ రణ్‌వీర్ అల్హాబాదియా చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలోనే కేంద్రం ఈ హెచ్చరిక చేసింది.

# చీటింగ్ కేసులో మహారాష్ట్ర మంత్రికి రెండేళ్ల జైలు శిక్ష



**ముంబయి :** సుమారు 30 ఏళ్ల క్రితం నాటి చీటింగ్ కేసులో మహారాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి, ఎన్‌సిపి నాయకులు మాణిక్‌రావు కొకాటేకు నాసిక్‌లోని కోర్టు రెండేళ్ల జైలు శిక్ష విధించింది. మంత్రితో పాటు అతని సోదరుడు సునీల్ కోకాటే జైలు శిక్షతో పాటు రూ.50వేలు జరిమానా విధించిస్తూ తీర్పు వెలువరించింది. నకిలీ పత్రాలు సృష్టించి, అక్రమాలకు పాల్పడి ప్రభుత్వ కోటాలో ఫ్లాట్‌లు పొందారని మాజీ మంత్రి టీఎస్ డిఘూలే 1995లో ఫిర్యాదుతో కోకటే సోదరులపై కేసు నమోదైంది. ఈ కేసులో మొత్తం 10 మంది సాక్షులను విచారించిన నాసిక్ జిల్లా సెషన్స్ కోర్టు.. కోకతే సోదరులిద్దరినీ దోషులుగా తేల్చి గురువారం శిక్షలు విధిస్తూ తీర్పు ఇచ్చింది. ఈ కేసులో మరో ఇద్దరు నిందితులను నిర్దోషిగా కోర్టు ప్రకటించింది. మరోవైపు, కోర్టు విచారణకు హాజరైన మంత్రి మాణిక్ రావు మాట్లాడుతూ.. ఈ కేసులో తనకు బెయిల్ మంజూరైందని తెలిపారు. ఈ తీర్పుపై హైకోర్టుకు అప్పీల్‌కు వెళ్తానని చెప్పారు. అయితే హైకోర్టు నుంచి ఉపశమనం లభించకపోతే మాణిక్‌రావ్ కోకాటే శాసనసభా సభ్యత్వంపై అనర్హత వేటు పడే అవకాశం ఉంది.

# క్రిమినల్ కేసులో విచారణకు దక్షిణ కొరియా అధ్యక్షుడు యూన్



**సియోల్ :** క్రిమినల్ కేసులో విచారణను ఎదుర్కొంటున్న దక్షిణ కొరియా అధ్యక్షుడు యూన్ సుక్ యోల్ గురువారం కోర్టుకు హాజరయ్యారు. గతేడాది డిసెంబరులో దేశంలో కొద్ది గంటల పాటు సైనిక పాలన విధించి తిరుగుబాటుకు కుట్ర పన్నారన్న క్రిమినల్ అభియోగాలతో అరెస్టు చేయడంపై యూన్ తరపు న్యాయవాదులు వాదిస్తున్నారు. సియోల్ సెంట్రల్ జిల్లా కోర్టులో జరుగుతున్న విచారణకు అధ్యక్షుడు రావడంతో ఆ ప్రాంతమంతా గట్టి బందోబస్తు చేశారు. ఆయన మద్దతుదారులు వందల సంఖ్యలో ర్యాలీలు నిర్వహించారు. క్రిమినల్ కేసులో ఇలా విచారణను ఎదుర్కొంటున్న మొదటి సిట్టింగ్ అధ్యక్షుడు యూన్. ముందుగా సాక్షులను విచారించిన తర్వాత యూన్ తరపు న్యాయవాదులు ఆయన అరెస్టును రద్దు చేసి కస్టడీ నుండి విడుదల చేయాల్సిందిగా కోరుతూ చేసిన అభ్యర్థనను కోర్టు పరిశీలించనుంది. డిసెంబరు 14న అధ్యక్షుడిని అభిశంసించిన తర్వాత ఆయన అధ్యక్ష అధికారాలను రద్దు చేశారు. ఇప్పుడు ఆయనను లాంఛనంగా పదవి నుండి తొలగించాలా లేక పార్లమెంట్ అభిశంసనను రద్దు చేసి, తిరిగి అధ్యక్ష పీఠంపై అధిష్టించాలా అని రాజ్యాంగ న్యాయస్థానం యోచిస్తోంది.

# ఇజ్రాయెల్ బందీల నాలుగు మృతదేహాలు హమాస్ అప్పగింత




ఇజ్రాయెల్‌కు చెందిన బందీల్లో నలుగురి మృతదేహాలను హమాస్ మిలిటెంట్లు గురువారం అప్పగించారు. మృతుల్లో ఒక తల్లి, ఆమె ఇద్దరు పిల్లలు, మరో బందీ ఉన్నారు. 2023 అక్టోబర్ 7న హమాస్ దాడి చేసినప్పుడు బందీలైన వారిలో వీరు ఉన్నారు. అయితే చాలా కాలం భయంతో ఉంటూ చనిపోయారు. జాతీయ విషాదానికి గుర్తులుగా వీరు మిగిలారు. మృతులు షిరి బిబాస్, ఆమె ఇద్దరు పిల్లలు ఏరియల్, కెఫిర్‌లతోపాటు 83 ఏళ్ల వృద్ధుడు ఓడెడ్ లిఫషిట్జ్ గా గుర్తించారు. బందీయైన సమయంలో కెఫిర్ కు తొమ్మిది నెలల వయసు. అత్యంత పిన్నవయసు బందీ అతడే. ఇజ్రాయెల్ వైమానిక దాడుల సమయంలో ఈ నలుగురినీ వారి రక్షకులతోసహా చంపివేశామని హమాస్ మిలిటెంట్లు వెల్లడించారు. హమాస్ నుంచి ఈ నలుగురి మృతదేహాలను గాజాస్ట్రిప్ నుంచి స్వాధీనం చేసుకున్నామని ఇజ్రాయెల్ మిలిటరీ నిర్ధారించింది. మృతదేహాలను గుర్తించడానికి ఇజ్రాయెల్ అధికారులు డిఎన్ఏ పరీక్ష చేస్తారు. ఈ ప్రక్రియ రెండు రోజులు పడుతుంది. మృతులను అధికారులు గుర్తించిన తరువాత రెడ్‌క్రాస్ కాన్వాయ్ మృతదేహాలను తీసుకుని ఇజ్రాయెల్‌కు వచ్చింది. భారీ సంఖ్యలో సాయుధులైన హమాస్ ఫైటర్లు, ఇతర వర్గాలకు చెందిన మిలిటెంట్లు, దక్షిణ గాజా లోని ఖాన్ యూనిస్ సమీప ప్రదేశంలో మృతదేహాల అప్పగింత సమయంలో హాజరయ్యారు. ఈ సందర్భంగా హమాస్ ఒక ప్రకటన విడుదల చేసింది. యుద్ధవిరమణ శాశ్వతం కాకున్నా, ఇజ్రాయెల్ సైన్యాలు పూర్తిగా వైదొలగకున్నా, మిగతా ఇజ్రాయెల్ బందీలను తాము విడిచిపెట్టబోమని హమాస్ హెచ్చరించింది. అయితే బందీలంతా విడుదలైన తరువాత హమాస్ మిలిటరీని, పాలనను అంతం చేస్తామని ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు వెల్లడించారు.

# దేశ ప్రజల డిమాండ్లకు పూర్తి తిరస్కరణ



**న్యూఢిల్లీ:** కేంద్రం ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ దేశ ప్రజల డిమాండ్లను పూర్తిగా తిరస్కరించిందని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యుడు విక్రమ్ సింగ్ విమర్శించారు. ప్రజా వ్యతిరేక బడ్జెట్‌ను నిరసిస్తూ గురువారం నాడిక్కడ జంతర్ మంతర్ వద్ద సిపిఎం, సిపిఐ, సిపిఐ-ఎంఎల్, ఆర్ఎస్‌పి, సిజిపిఐ తదితర వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో ఆందోళన జరిగింది. ఈ ఆందోళనలో ప్లకార్డులు చేబూని కార్మిక, రైతు, విద్యార్థి, పేదలకు వ్యతిరేక కేంద్ర బడ్జెట్ అంటూ మోడీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాల హోరెత్తించారు. ఈ సందర్భంగా సిపిఎం కేంద్ర కమిటీ సభ్యుడు విక్రమ్ సింగ్ మాట్లాడుతూ కేంద్రం తన బడ్జెట్‌లో ఉపాధి కూలీలు, రైతులు వంటి వారిని పూర్తిగా విస్మరించిందని ధ్వజమెత్తారు. సబ్సిడీలకు కోత విధించారని, మరోవైపు కార్పొరేట్లకు రాయితీలు ప్రకటించారని విమర్శించారు. బడ్జెట్ దేశ ప్రజల అవసరాలను పూర్తిగా విస్మరించిందని అన్నారు. నిరుద్యోగం, తగ్గుతున్న వేతనాలకు కారణమయ్యే ఆర్థిక వ్యవస్థ ఎదుర్కొంటున్న ప్రాథమిక సమస్యలను పరిష్కరించడానికి బదులుగా, మోడీ ప్రభుత్వం ఎక్కువ ఆదాయం కలిగిన వారికి పన్నులను తగ్గించిందన్నారు. అదే సమయంలో ప్రజలకు చేయాల్సిన ఖర్చును తగ్గిస్తోందని విమర్శించారు. దేశంలోని కార్పొరేట్ వర్గం మినహాయిస్తే, అన్ని వర్గాల ప్రజలను ఈ బడ్జెట్ తిరస్కరించిందని అన్నారు. ఇది ప్రజా వ్యతిరేక, కార్పొరేట్ అనుకూల బడ్జెట్ అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం ఢిల్లీ రాష్ట్ర కార్యదర్శి అనురాగ్ సక్సేనా, సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ కార్యదర్శి దినేష్ వర్ష్నే, రామకృష్ణ పాండే (సిపిఐ), రవి రారు (సిపిఐ ఎంఎల్), మన్వేంద్ర ప్రతాప్ సింగ్ (ఆర్ఎస్‌పి), బిర్జున్ నాయక్ (సిజిపిఐ) తదితరులు పాల్గొని ప్రశంసించారు.

# లూటీ చేసిన ఆయుధాలను 7 రోజుల్లోగా అప్పగించండి



ఇంఫాల్: భద్రతదళాల నుంచి లూటీ చేసిన ఆయుధాలను వారం రోజుల్లోగా అప్పగించాలని రాష్ట్రంలోని అన్ని గ్రూపులకు మణిపూర్ గవర్నర్ అజయ్ కుమార్ భల్లా గురువారం విజ్ఞప్తి చేశారు. తమ వద్ద ఉన్న అక్రమ ఆయుధాలు, పేలుడు పదార్థాలను ఏడు రోజుల్లోగా అప్పగించాలని, లేదంటే కఠిన చర్యలు తప్పవనిహెచ్చరించారు. దాదాపు రెండేళ్లుగా హింసాకాండ కొనసాగుతున్న మణిపూర్‌లో కేంద్రం ఇటీవల రాష్ట్రపతి పాలన విధించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలోనే మణిపూర్‌లో శాంతి పునరుద్ధరించే లక్ష్యంతో గవర్నర్ అజరు భల్లా ఈ ప్రకటన విడుదల చేశారు. "శాంతి, మత సామరస్యతను దెబ్బతీసే దురదృష్టకర ఘటనలతో మణిపుర్‌లోని లోయ, కొండ ప్రాంతాల్లోని ప్రజలు 20 నెలలకు పైగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అక్కడ సాధారణ స్థితిని పునరుద్ధరించేందుకు ప్రజలు తమ దైనందిన కార్యకలాపాలను కొనసాగించేం దుకు వీలుగా అన్ని గ్రూపులు వైరాన్ని వీడి శాంతిభద్రతలను కాపాడుకొనేందుకు ముందుకు రావాలి. మరీ ముఖ్యంగా యువత అక్రమ ఆయుధాలు, పేలుడు పదార్థాలను సమీపంలోని పోలీస్‌స్టేషన్/అవుట్ పోస్టు/ భద్రతా దళాల క్యాంపుల్లో సరెండర్ చేయాలి. నిర్ణీత సమయంలోగా ఆయుధాలను తిరిగి ఇస్తే ఎలాంటి శిక్షార్హమైన చర్యలు ఉండవు. లేదంటే కఠిన చర్యలు తప్పవు. ప్రస్తుతం నెలకొన్న పరిస్థితికి శాంతి యుతమైన పరిష్కారం కోసం, యువత భవిష్యత్తును కాపాడేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉంది. ఉజ్వల భవిష్యత్తు కోసం అందరం కలిసి రాష్ట్రాన్ని పునర్నిర్మి ంచుకుం దాం.. ముందుకు రండి. శాంతి మార్గాన్ని ఎంచుకోండి" ప్రకటనలో గవర్నర్ పేర్కొన్నారు.

# 32 సీసీటీవీ కెమెరాలను ప్రారంభించిన సైబరాబాద్ సీపీ



**కూకట్పల్లి (మన వెలుగు) ఫిబ్రవరి 21:** బాలానగర్ సీఐ నర్సింహా రాజు నెత్రుత్వంలో ఇటీవల నిర్వహించిన సీసీటీవీల ప్రాముఖ్యత అవగాహనా కార్యక్రమంలో భాగంగా బాలానగర్ డివిజన్ పరధిలోని ఆదర్శ్ నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతనంగా ఏర్పాటు చేసిన 32 సీసీకెమెరాలను శుక్రవారం సైబరాబాద్ పోలీస్కమిషనర్ అవినాష్ మొహంతి, ఐపీస్ బాలానగర్ డీసీపీ సురేష్ కుమార్, ఐపీస్, బాలానగర్ ఏసీపీ హనుమంతా రావు తోకలసి శుక్రవారం వాటిని ప్రారంభించారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సీపీ మొహంతి మాట్లాడుతూ ప్రజల రక్షణ, భద్రత కోసం పోలీసుశాఖ తీసుకుంటున్న వివిధ రకాల చర్యలపై బాలానగర్ పోలీసులు అవగాహన కల్పిస్తుండటం వల్లనే అన్నివర్గాల ప్రజలు ముందుకువచ్చి స్వచ్ఛందంగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకుంటున్నారని అన్నారు. సీసీకెమెరాల ఏర్పాటుకు సహకరించిన ఆదర్శ్ నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులను, ప్రత్యేక కార్యక్రమాలు ఏర్పాటుచేసి అవగాహనా కల్పిస్తున్న బాలానగర్ సిఐ నర్సింహా రాజును ఈ సందర్భంగా సీపీ అభినందించారు.అంతేకాక సమాజ భద్రతలో భాగంగా ప్రతి కలనిలో సీసీటీవీలు ఏర్పాటు చేసుకోవాలని కోరారు. ఇందుకొరకు కావలసిని సాంకేతిక సహకారం అందిస్తామన్నారు. నేర నియంత్రణలో సీసీటీవీలు కీలక పాత్ర పోషిస్తాయని ఈ సందర్బంగా అన్నారు. ఈ కార్యక్రమంలో బాలానగర్ సిఐ నర్సింహా రాజు, డిఐ నాగిరెడ్డి, ఎస్ఐలు రాంనారాయణ్, సరళ, హాజీ మియా, ఆదర్శ్ నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు శంకరయ్య, దుర్గ, ఆంజనేయులు, రవికుమార్, నాగభూషణం, నాంచారమ్మ, చంద్రశేఖర్ ఇతరులు పాల్గొన్నారు.

# జేఎన్టియుహెచ్ వైస్ ఛాన్సలర్ వీసీగా కిషన్ కుమార్ రెడ్డి




**కూకట్పల్లి (మన వెలుగు) ఫిబ్రవరి 21:** విశ్వవిద్యాలయ చరిత్రలో ప్రత్యేకమైన ఘట్టంగా నిలిచింది గత 16 సంవత్సరాలుగా, ఇతర విశ్వవిద్యాలయాల నుంచి ప్రొఫెసర్లను వీసీ గా నియమిస్తున్న పరిస్థితిలో, ఈసారి జే ఎన్ టి యు హెచ్ లోనే పనిచేసి, రిటైర్మెంట్ పొందిన మెకానికల్ విభాగం ప్రొఫెసర్ను వీసీ గా ఎంపిక చేయడం విశేషం ఈ సందర్భంలో జే ఎన్ టి యు హెచ్ - జేఏసీ సభ్యులు వీసీ ని మర్యాదపూర్వకంగా కలవడంతో పాటు, శుభాకాంక్షలు తెలియజేసి, శాలువాతో సత్కరించి, గజమాలతో ఘనంగా సన్మానించారు. అనంతరం, విశ్వవిద్యాలయంలో ఉన్న విద్యార్థుల సమస్యలు, అందుబాటులో ఉన్న సౌకర్యాలు తదితర అంశాలపై వీసీ తో చర్చించగా, ఆయన సానుకూలంగా స్పందించారు. జే ఎన్ టి యు హెచ్ ను భారతదేశంలో నంబర్ 1 విశ్వవిద్యాలయంగా అభివృద్ధి చేయాలనే ఆకాంక్షను ఈ సమావేశంలో వ్యక్తం చేయడం విశేషం. ఈ కార్యక్రమంలో జే ఎన్ టి యు హెచ్ - జేఏసీ చైర్మన్ మంద రంజిత్ కుమార్, ప్రెసిడెంట్ కోతురు పవన్, వైస్ ప్రెసిడెంట్ మూడ్ నరేష్, బొజ్జ ప్రణయ్ భాస్కర్, సభ్యులు సందీప్, సాగర్,వంశీ, రవి, వినయ్, నితీష్, శ్రీకర్ తదితరులు పాల్గొని విశ్వవిద్యాలయ అభివృద్ధికి తమ మద్దతును ప్రకటించారు.

# ముధోల్ అభివృద్ధి మూలకేనా..!

## - విద్యా, వైద్యం పట్ల ఆందోళన చెందుతున్న ప్రజలు



**ముధోల్ (మనవెలుగు):** గత పది సంవత్సరాలు యేలిన ప్రభుత్వం సర్కారు దవాఖానా కొత్తగా ప్రారంభించినప్పటికీ వేసిన పిల్లర్లు మొలిసిన పొదలు గడ్డి తప్ప మరేమి కనిపిస్తలేవని ముధోల్ మండల ప్రజలు వాపోతున్నారు. ఇప్పటి ప్రభుత్వం హామీలు ఇచ్చినప్పటికీ అవి మండలంలో ఉన్న విద్యా వైద్యానికి అంది అందనట్టుగా ఉన్నాయని అభిప్రాయపడుతున్నారు.మూడేళ్ళుగా పెండింగ్ లో ఉన్న ఆసుపత్రి పూర్తీ చేయాల్సి ఉండగా దానిని పట్టించుకునే నాదులు కరువైయారు. విద్యాలయాల్లో విద్యార్థులు అరకొర వసతులతో విద్యను అభ్యాసిస్తున్నారని ముఖ్యంగా ముధోల్ లో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ గురుకుల విద్యాలయం ఏర్పాటు పెండింగ్ లో ఉందని మహాత్మా జ్యోతి బీసీ గురుకులం ప్రభుత్వ భవనం లేక కిరాయిలో ఉండి వర్షాకాలంలో విద్యార్థులు నీటిలో నడుస్తూ, రోగాల భారిన పడుతున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అదే విధంగా మైనారిటీ గురుకుల శాశ్వత భవంతి లేక కిరాయి భవనం లో విద్య కొనసాగుతుందని,ఎస్సి హాస్టల్ శిథిలావస్థకు చేరి కూలిపోయే స్థితిలో ఉండటం తో కిరాయి భవనం లో విద్యను బోదిస్తున్నారు. గత ఇరవై ఏళ్లుగా ఆసుపత్రి సక్కగా లేక ఆపరేషన్స్ ఆగిపోయి గరీబోళ్లకి సర్కారు వైద్యం కరువైంది. బిల్లులు రాక పునాదిరాళ్ళకే పరిమితమైన ముధోల్ సర్కారు దవాఖాన నిర్మాణ పనులను త్వరగా చేపట్టాలని, ప్రజల ఆరోగ్యాలను కాపాడాలని మోరపెట్టుకుంటున్నారు. హామీలు ఇవ్వడం మాని ఇచ్చిన హామీలను నెరవేరిస్తే మాకు అదే పదివేలు అన్న చందంగా ప్రజలు కోరుకుంటున్నారు. రాజకీయాల్లో ఆరితేరిన నాయకులున్న ముధోల్ నియోజకవర్గంలో అభివృద్ధి మాత్రం శూన్యంగా మిగిలిపోతుందని ఇప్పటికైనా నాయకులు పార్టీలకు అతీతంగా ప్రజలకు చేరువగా ఉంటూ నియోజకవర్గ అభివృద్ధికి పాటుపడాలని ముధోల్ ప్రజానికం కోరుకుంటున్నారు.

# కుంభమేళా ప్రసాదాన్ని స్వీకరించిన మాజీ ఎమ్మెల్యే



**ముధోల్ (మనవెలుగు):** ముధోల్ నియోజకవర్గంలోని భైంసా పట్టణంలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మాజీ ఎంపీపీ చంద్రకాంత్ కుంభమేళ ప్రయాగ్రాజ్ వెళ్లి వచ్చిన సందర్భంగా ప్రసాదాన్ని తీసుకొచ్చి ముధోల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మాజీ శాసనసభ్యులు శ్రీ భోస్లే నారాయణ్ రావు పటేల్ గారిని ఇవ్వడం జరిగింది.ప్రసాదాన్ని స్వీకరిస్తూ మాజీ ఎమ్మెల్యే నారాయణ రావు పటేల్ ప్రసాదం మహా పవిత్రమైనదని ముధోల్ నియోజకవర్గంలోని ప్రజలు ఆ మహాదేవుని ఆశీస్సులతో క్షేమంగా ఉండాలని, ప్రతీ ఒక కుటుంబం సుఖ సంతోషాలతో వర్ధిల్లాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. అనుకున్న విధంగా ప్రజలకు ప్రభుత్వం అన్ని సదుపాయలను కల్పిస్తుందని ఈ విషయంలో ఎవరు చింతించవద్దని కాకపోతే గత పాలన వైఫల్యం వల్ల మన అభివృద్ధిలో కొన్ని అవాంతరాలు వస్తున్నాయని అతి తొందరలో అవి కూడా తొలిగిపోయి అభివృద్ధి సాధించుకుంటామని, రైతన్నలు శేనగ పంటలను ఈ సారి అద్భుతంగా పండించారని రైతన్న కష్టపడి పండించిన పంటకు ప్రభుత్వం కూడా మంచి మద్దతు ధర పలకడంతో నియోజకవర్గ ప్రజలు ఆనందంగా ఉన్నారని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శంకర్ చేంద్రే తదితరులు పాల్గొన్నారు.

# స్టామ్ వాటర్ డ్రైన్ పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే



**శేర్లింగంపల్లి( మనవెలుగు) ఫిబ్రవరి 21:** కొండాపూర్ డివిజన్ పరిధిలోని, మాదాపూర్ విలేజ్ లోని, గఫూర్ నగర్ లోని జీహెచ్ఎంసీ పార్కు వద్ద రూ.11.55 లక్షలు (పదకొండు కోట్ల ఏభై ఐదు లక్షలు) రూపాయలు అంచనా వ్యయంతో, స్టామ్ వాటర్ డ్రైన్ (వరద నీటి కాలువ) కు స్థానిక నాయకులతో కలసి,శేరిలింగంపల్లి నియోజకవర్గం శాసన సభ్యులు అరేకపూడి గాంధీ, కొండాపూర్ డివిజన్ కార్పొరేటర్ హమీద్ పటేల్, సీనియర్ నాయకులతో కలసి శంకుస్థాపన చేశారు. ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ...తెలంగాణ రాష్ట్రంలో శేరిలింగంపల్లి నియోజకవర్గం ఒక ఫైనాన్సియల్ క్యాపిటల్ నియోజకవర్గమని అన్నారు. శేరిలింగంపల్లి నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసుకుంటూ వచ్చామని, ఇక ముందు కూడా మరింతగా అభివృద్ధి పథంలో తీసుకోని వెళతామని అన్నారు.కార్పొరేటర్ హమీద్ పటేల్ మాట్లాడుతూ కొండాపూర్ డివిజన్ ఒక హైటెక్ డివిజన్ గా పేరు గాంచిదని, ఈ డివిజన్ లోని సాఫ్ట్వేర్ కంపెనీలకు అన్ని విధాలుగా తోడ్పాటు అందిస్తున్నామని అన్నారు. ఒకప్పటి బస్తిలు ఇప్పుడు మౌలిక వసతులతో కూడిన కాలనీలుగా అభివృద్ధిగా చెందాయని అన్నారు. అదే స్థాయిలో గ్రేటర్ కమ్యూనిటీ కాలనీలు పెరిగాయని అన్నారు. కొండాపూర్ డివిజన్ ను మరింతగా అభివృద్ధి చేసి, శేరిలింగంపల్లి నియోజకవర్గంలోను, తెలంగాణ రాష్ట్రంలోను ప్రధమ స్థాయిలో నిలబెట్టటానికి కృషి చేస్తామని అన్నారు. ఈ శంకుస్థాపన కార్యక్రమంలో పిఏసీ చైర్మన్, ఎమ్మెల్యే గాంధీ,కొండాపూర్ కార్పొరేటర్ హమీద్ పటేల్, మాజీ కార్పొరేటర్ నీలం రవీందర్ ముదిరాజ్, ఊట్ల కృష్ణ, మల్లెల శ్రావణ్ యాదవ్, ఎర్రగుండ్ల శ్రీనివాస్ యాదవ్, కుమ్మరి సిల్వర్ శ్రీనివాస్, మంగళరాపు తిరుపతి, శ్రీనివాస్ చౌదరి, బుడుగు తిరుపతి రెడ్డి, రజనీకాంత్, నరేష్ ముదిరాజ్, వినయ్, పిఎస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# అథ్లెటిక్స్ లో మెరిసిన ఆష్ట కుసుమం



**ముధోల్ (మనవెలుగు):** ముధోల్ మండలం ఆష్ట గ్రామానికి చెందిన బాలయిగారి రాజశేఖర్ సుగుణ దంపతుల కుమార్తె స్వాతి రెండవ సారి అథ్లెటిక్స్ లో రాణించడం ఆష్ట గ్రామానికి వన్నె తెచ్చిందని గ్రామస్థులు కొనియాడారు. వివరాల్లోకి వెళితే రంగారెడ్డి జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ స్పోర్ట్స్ అథారిటీ పదకొండవ తెలంగాణ యూత్ అథ్లెటిక్స్ ఛాంపియన్షిప్ లో భాగంగా యూనివర్సిటీ గ్రౌండ్స్ హైదరాబాద్ నందు జరిగినటువంటి పోటీలలో బి. స్వాతి బ్రంజ్ మెడల్ కైవసం చేసుకుంది. జావేలిన్ త్రో అకాడమీ విజివస్ డిఫెన్స్ ఉమెన్స్ విభాగం ఈ పథకాన్ని కైవసం చేసుకున్నట్టు కోచ్ రాకేష్ మరియు వెయిట్ లిఫ్టింగ్ సెక్యూరిటీ జ్యోతిశ్వరాన్ తెలిపారు. ఈ పోటీలలో అమ్మాయి రెండో సారి విజేతగా నిలవడం గర్వాంగా ఉందని రాబోయే పోటీలలో కచ్చితంగా మొదటి స్థానంలో నిలబెడతామని ధీమా వ్యక్తం చేసారు. అష్ట గ్రామం నుండి రాష్ట్ర స్థాయి కబడ్డీ మరియు ఖోఖో పోటీలలో కూడా విద్యార్థులు విజయం సాధించారని గ్రామస్థుల ప్రొద్బలం, ఉపాధ్యాయుల ప్రోత్సాహం తో విద్యార్థులు ఇటు చదువులో అటు క్రీడా రంగాలలో చక్కగా రాణిస్తున్నారని గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు.

# భైంసా కు కేంద్ర మంత్రి బిజెపి రాష్ట్ర అధ్యక్షులు కిషన్ రెడ్డి రాక



**భైంసా (మన వెలుగు) :** ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా రేపు భైంసాకు కేంద్రమంత్రి, బిజెపి రాష్ట్ర అధ్యక్షులు కిషన్ రెడ్డి రానున్నారని ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ తెలియజేశారు. సాయంత్రం 4నాలుగు గంటలకు ఎస్ ఎస్ జిన్నింగ్ ఫ్యాక్టరీలో నియోజకవర్గ కార్యకర్తలు, పట్టభద్రుల ఓటర్లతో సమావేశం నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమానికి బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి, ఎంపీ గోడం నగేష్ తో పాటు బిజెపి జిల్లా అధ్యక్షులు, రాష్ట్ర నాయకులు హాజరవుతారన్నారు. ప్రతి ఒక్కరు తప్పనిసరిగా సమావేశానికి హాజరుకావాలని ఎమ్మెల్యే కోరారు.

# దొంగతనం కేసులో నిందితుడికి 6 నెలల

## జైలు శిక్ష 2 వందలు జరిమాన

**మెట్ పల్లి (మన వెలుగు) ఫిబ్రవరి 21 :** మెట్పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని హనుమాన్ ఆలయంలో 28-10-2024 న జరిగిన దొంగతనం కేసులో బొల్లవేని మహేష్, మెట్పల్లి కి చెందిన వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరచగా నిందితుడు సదరు దొంగతనాన్ని చేసినట్లు ఒప్పుకోవడం జరిగింది. ఈ కేసును విచారణ జరిపిన మెట్పల్లి జడ్జి అరుణ్ కుమార్ నిందితుడు అయిన బొల్లవేని మహేష్ కు 6 నెలల జైలు శిక్ష మరియు 200 రూపాయల జరిమాన విధించడం జరిగింది.

# నిర్లక్ష్యంగా లారీని నడిపి ఒకరి మరణానికి కారణమైన

## నిందితుడికి 18 నెలల జైలు శిక్ష, 5500 వందల జరిమాన

**ధర్మపురి (మన వెలుగు) ఫిబ్రవరి 21 :** నిర్లక్ష్యంగా లారీని నడిపి ఒకరి మరణానికి కారణమైన నిందితుడికి 18 నెలల జైలు శిక్ష, 5500 వందల జరిమాన వింధించిన కోర్టు. వివరాల్లోకి వెళ్ళితే.. ధర్మపురి పోలీస్ స్టేషన్ పరిధిలోని రాయపట్నం గ్రామానికి చెందిన గటికె కృష్ణమూర్తి అనే వ్యక్తి 02-05-2018న పని నిమిత్తం రాయపట్నం నుండి ధర్మపురికి వెళ్లి తిరుగు ప్రయాణంలో రాత్రి 8 గంటలకు ద్విచక్ర వాహనం పై వస్తున్న క్రమంలో రామయ్య పల్లె బస్ స్టేజ్ వద్ద వెనుక నుండి ఏపీ 16 ఏవై 0689 గల లారీ అతివేగంగా వచ్చి వెనుక నుండి కృష్ణమూర్తి ద్విచక్ర వాహన ఢీకొట్టగా కృష్ణమూర్తి తీవ్ర గాయాలయి అయి అక్కడికక్కడే మరణించడం జరిగింది. ఈ ప్రమాదం సంభవించినదని తెలిసినా కూడా లారీ డ్రైవర్ జగిరి మల్లేశ్ (26) అనే వ్యక్తి అక్కడ అగాకుండా వెళ్ళగా దీన్ని గమనించిన స్థానికులు లారీని వెంబడించి రాయపట్నం దగ్గర అపి పోలీసులకు సమాచారం అందించడం జరిగింది. ఇట్టి విషయం గురించి గటికె కృష్ణమూర్తి బార్య అనురాధ ధర్మపురి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా నిందితుడి పై కేసు నమోదు చేసి విచారణ జరిపి ఛార్జ్ షీటు దాఖలు చేశారు.సాక్షులను విచారించిన జడ్జి శ్యామ్ ప్రసాద్ నిందితుడైన మల్లేష్ కు 18 నెలల జైలు శిక్ష, 5500 వందలజరిమాన విధిస్తూ తీర్పునిచ్చారు. పై కేస్ లో నిందితునికి శిక్ష పడటం లో కృషి చేసిన అడిషనల్ పీపీ రాజేష్,ఇన్వెస్టిగేషన్ ఆఫీసర్ లక్ష్మీనారాయణ, కోర్ట్ కానిస్టేబుల్ రామును జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ అభినందించారు.

# యంగ్ కాలేజ్ గర్ల్‌గా కనిపిస్తా




పీపుల్స్ స్టార్ సందీప్ కిషన్ ల్యాండ్‌మార్క్ 30వ సినిమా 'మజాకా'కి ధమాకా మేకర్ త్రినాధరావు నక్కిన దర్శకత్వం వహిస్తున్నారు. ఈ చిత్రాన్ని ఎకె ఎంటర్‌టైన్‌మెంట్స్, హాస్య మూవీస్ బ్యానర్స్ పై రాజేష్ దండా నిర్మిస్తున్నారు. బాలాజీ గుత్తా సహ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. ఈ మాస్ ఎంటర్‌టైనర్‌లో రీతు వర్మ హీరోయిన్. మన్మధుడు ఫేమ్ అన్షు, రావు రమేష్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ హైలీ ఎంటర్ టైనింగ్ మూవీ శివరాత్రి కానుకగా ఫిబ్రవరి 26న థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల కానుంది. ఈ సందర్భంగా హీరోయిన్ రీతూ వర్మ విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ "ప్రసన్న ఈ కథ చెప్పినపుడు చాలా ఎంటర్‌టైనింగ్‌గా అనిపించింది. కథ విన్నప్పుడు నవ్వుతూనే వున్నాను. సినిమాలో రెండు ఫీమేల్ క్యారెక్టర్స్‌కి కథలో చాలా ప్రాధాన్యత ఉంది. సెకండ్ హాఫ్‌లో నాకు, రావు రమేష్‌కి ఓ సింగిల్ టేక్ సీన్ వుంది. ఆ రోజు షూట్ చేసినప్పుడు అవుట్ పుట్ విషయంలో అందరూ చాలా హ్యాపీ అయ్యారు. సీన్ చాలా అద్భుతంగా వచ్చింది. రావు రమేష్ డబ్బింగ్ పూర్తి చేసి ఫోన్ చేశారు. ఆ సీన్ గురించి మాట్లాడుతూ.. 'చాలా అద్భుతంగా చేశావు అమ్మా.. నా 16 ఏళ్ల కెరీర్‌లో అలాంటి సీన్ చూడలేదు' అని ఆయన చెప్పడం నాకు చాలా మరచిపోలేని అనుభూతినిచ్చింది. -సినిమా ఫుల్ ఎంటర్‌టైనింగ్‌గా ఉండబోతోంది. కామెడీ, ఎమోషన్స్ హైలైట్‌గా ఉంటాయి. -ఇందులో యంగ్ కాలేజ్ గర్ల్‌గా కనిపిస్తా. సందీప్ పాత్రతో తన బంధం చాలా ఆసక్తికరంగా ఉంటుంది. ఇప్పటివరకూ చేయని క్యారెక్టర్‌లో నేను కనిపిస్తా. -హీరో సందీప్ కిషన్‌తో కలిసి పనిచేయడం అద్భుతమైన అనుభూతినిచ్చింది. -ఇక తెలుగులో ఓ మల్టీ స్టారర్‌కు సైన్ చేశాను. అలాగే ఓ వెబ్ సిరిస్ చేశాను"అని అన్నారు.

# ఫ్లాప్ సినిమాతో అన్ని డబ్బులొచ్చాయా



ది కశ్మీర్ ఫైల్స్' చిత్రంతో సెన్సేషన్ క్రియేట్ చేసిన దర్శకుడు వివేక్ అగ్నిహోత్రి. కేవలం 15 కోట్ల స్వల్ప బడ్జెట్లో తెరకెక్కిన ఆ చిత్రం.. అప్పట్లో రూ.300 కోట్లకు పైగా వసూళ్లు రాబట్టి సంచలనం రేపింది. పెద్దగా అంచనాలు లేకుండా విడుదలైన ఆ సినిమా.. బాక్సాఫీస్ దగ్గర ఒక యుఫోరియా క్రియేట్ చేసి, ఎవ్వరూ ఊహించని స్థాయికి వెళ్లిపోయింది. ఐతే ఈ ఊపులో వివేక్ తీసిన 'ది వ్యాక్సిన్ వార్' మాత్రం ప్రేక్షకులను మెప్పించలేకపోయింది. కొవిడ్ తర్వాత వ్యాక్సిన్ల తయారీ కోసం ఫార్మా కంపెనీలు పోటీపడడం.. ఇందులోని రాజకీయాల చుట్టూ తిరిగే ఆ సినిమాకు టాక్ బాగున్నా కూడా బాక్సాఫీస్ దగ్గర విజయం దక్కలేదు. ప్రేక్షకుల దృష్టిలో పడకుండానే సినిమా వెళ్లిపోయింది. అందరూ దీన్ని డిజాస్టర్ అనే అనుకుంటుండగా.. వివేక్ మాత్రం ఆ చిత్రంతో భారీ లాభాలు ఆర్జించినట్లు చెబుతుండడం విశేషం. వివేక్ నుంచి రాబోతున్న కొత్త చిత్రం.. ది ఢిల్లీ ఫైల్స్: బెంగాల్ చాప్టర్'. ప్రస్తుతం మేకింగ్ దశలో ఉన్న ఈ సినిమా గురించి ఒక నెటిజన్ నెగెటివ్ కామెంట్ చేయడంతో వివేక్ అగ్నిహోత్రికి కోపం వచ్చింది. 'ది వ్యాక్సిన్ వార్' సక్సెస్ కాదని.. దీనికి కూడా 'ది వ్యాక్సిన్ వార్'కు కూడా పట్టిన గతే పడుతుందని సదరు నెటిజన్ వ్యాఖ్యానించాడు. దీనికి వివేక్ బదులిస్తూ.. "వావ్.. మీరు అద్భుతమైన విషయం చెప్పారు. 'ది వ్యాక్సిన్ వార్'తో మేం పెద్ద ఎత్తున డబ్బులు సంపాదించాం. ఆ డబ్బులనే పెట్టుబడిగా పెట్టి 'ది ఢిల్లీ ఫైల్స్' తీశాం" అంటూ కౌంటర్ ఇచ్చాడు వివేక్. పదేళ్లకు పైగా కేంద్రంలో అధికారంలో ఉన్న ఎన్డీయే సర్కారుకు అనుకూలంగా ప్రాపగండా సినిమాలు తీస్తాడని వివేక్ మీద ఒక ముద్ర ఉంది.

# వెంకీ చైతు తీర్చుకున్నారు



2025 ప్రారంభంలో రెండు పవర్ ఫుల్ కంబ్యాక్స్ జరిగిపోయాయి. కొన్ని సంవత్సరాలుగా తన స్థాయి బ్లాక్ బస్టర్ కోసం ఎదురు చూస్తున్న వెంకటేష్ కు సంక్రాంతికి వస్తున్నాం రూపంలో ఒకటి రెండు కాదు ఏకంగా మూడు వందల కోట్ల ఇండస్ట్రీ హిట్ దక్కింది. మాస్ కోసం తీసిన డాకు మహారాజ్ ని డామినేట్ చేసి మరీ ఈ ఫిగర్ సాధించడం చిన్న విషయం కాదు. ఇక దగ్గుబాటి అభిమానుల సంతోషం గురించి చెప్పేదేముంది. ఏకంగా వాల్తేరు వీరయ్యని సవాల్ చేసే రేంజ్ లో వసూళ్లు నమోదు కావడం కొన్ని సంవత్సరాలు చెప్పుకుంటారు. దీని దెబ్బకే వెంకటేష్ తర్వాతి సినిమా విషయంలో తొందరపాటు చూపించడం లేదు. ఈ నెలలో నాగచైతన్య కోటా పూర్తయిపోయింది. కస్టడీ, థాంక్ యు లాంటి పూర్ డిజాస్టర్స్ నుంచి పూర్తిగా కోలుకునేలా తండేల్ ఫుల్ కిక్ ఇచ్చేసింది. పది రోజుల తిరక్కుండానే వంద కోట్లు వచ్చేసినట్టు నిర్మాణ సంస్థ అధికారికంగా ప్రకటించింది. లెక్కల సంగతి పక్కనపెడితే చైతు హిట్ దాహాన్ని తండేల్ తీర్చిన మాట వాస్తవం. ఇక నెక్స్ట్ అందరి చూపు రవితేజ వైపు వెళ్తోంది. ధమాకా తర్వాత సోలో హీరోగా మాస్ మహారాజా హిట్టు కొట్టలేదు. రావణాసురతో మొదలుపెట్టి మిస్టర్ బచ్చన్ దాకా దాదాపు అన్నీ లాస్ వెంచర్లే. అందుకే సితార నిర్మాణంలో రూపొందుతున్న మాస్ జాతర మీద ఫ్యాన్స్ బోలెడు నమ్మకం పెట్టుకున్నారు. భాను భోగవరపు దర్శకుడిగా కొత్తవాడే కానీ రచయితగా మాస్ ఎంటర్ టైనర్లు రాయడంలో చేయి తిరిగిన అనుభవం సంపాదించుకున్నాడు.

# రెహమాన్ ప్లస్సా మైనస్సా



దేశవ్యాప్తంగా సంచలనాత్మక వసూళ్లతో దూసుకుపోతున్న చావా విషయంలో కొంత అసంతృప్తి రేగుతున్న అంశాల్లో ఏఆర్ రెహమాన్ సంగీతం ఒకటి. చాలా ముఖ్యమైన ఎపిసోడ్స్ సరైన రీతిలో ఎలివేట్ అయ్యేలా బిజిఎం ఇవ్వలేకపోయారని మ్యూజిక్ లవర్స్ అభిప్రాయపడుతున్నారు. మెచ్చుకుంటున్న వాళ్ళు లేకపోలేదు కానీ ఆయన స్థాయి ఇందులో లేదన్నది ప్రధానంగా వినిపిస్తున్న కామెంట్. హిస్టారికల్ బ్యాక్ డ్రాప్ ఉన్న సినిమాలకు రెహమాన్ బెస్ట్ ఏదని చెప్పుకోవాల్సి వస్తే ముందుగా గుర్తొచ్చేది జోధా అక్బర్. పాటలు, బ్యాక్ గ్రౌండ్ స్కోర్ దేనికవే సాటి అనేలా దర్శకుడు అశుతోష్ గోవరికర్ విజన్ ని నిలబెట్టాయి. అంతకు ముందు జుబేదా, కొచ్చాడయన్, మంగళ్ సింగ్, పొన్నియిన్ సెల్వన్, మోహెన్జదారో లాంటి చారిత్రాత్మక సినిమాలకు సంగీతం అందించిన రెహమాన్ దేనికీ అవుట్ స్టాండింగ్ ఆల్బమ్ ఇవ్వలేదనేది ఒక వర్గం వాదన. ది లెజెండ్ అఫ్ భగత్ సింగ్ లాంటి ఒకటి రెండు మాత్రమే కొంత వర్కౌట్ అయ్యాయి. అయినా వింటేజ్ రెహమాన్ మనకు వినిపించి సంవత్సరాలు గడిచిపోతున్న టైంలో చావాకు ఇచ్చింది డీసెంట్ వర్కనే చెప్పాలి. కాకపోతే మళ్ళీ మళ్ళీ వినాలనిపించేలా పాటలు లేకపోవడం కొంత నిజమే అయినా మూడు దశాబ్దాల తర్వాత కూడా లెజెండరీ మ్యూజిషియన్ నుంచి ఇంతకన్నా ఆశించడం కరెక్ట్ కాదు. ఇదంతా పక్కనపెడితే ఏఆర్ రెహమాన్ నెక్స్ట్ చేయబోయే సినిమా రామ్ చరణ్ 16. మూడు సాంగ్స్ రికార్డింగ్ కూడా అయిపోయింది. అసలే టాలీవుడ్ స్ట్రెయిట్ సినిమాలకు హిట్ ఇవ్వలేదనే నింద రెహమాన్ మీద ఎప్పటి నుంచో ఉంది. సూపర్ పోలీస్, గ్యాంగ్ మాస్టర్, నాని, నీ మనసు నాకు తెలుసు, కొమరం పులి, సాహసం శ్వాసగా సాగిపో లాంటివన్నీ సోసోగా ఆడాయి. ఏ మాయ చేశావే మాత్రమే హిట్ అయ్యింది.

# నటి సంచలన వ్యాఖ్యలు



మరాఠా సామ్రాజ్యాన్ని పరిపాలించిన రెండో రాజు, ఛత్రపతి శివాజీ మహారాజ్ కుమారుడు ఛత్రపతి శంభాజీ మహారాజ్ జీవితగాధ ఆధారంగా తెరకెక్కిన చిత్రం 'ఛావా'. గత శుక్రవారం విడుదలైన ఈ సినిమా బ్లాక్‌బస్టర్ హిట్‌గా నిలిచింది. ఈ సినిమాలో ప్రధాన పాత్రల్లో విక్కీ కౌశల్, రష్మిక మందన్న నటించారు. ఇప్పటికే ఈ సినిమాను చూసిన పలువురు ప్రముఖులు ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు. అయితే బాలీవుడ్ నటి స్వరా భాస్కర్ మాత్రం ఇందుకు భిన్నంగా స్పందించారు. ఛావా సినిమాను కుంభమేళా మరణాలతో పోలుస్తూ ఆమె ట్వీట్ చేశారు. 'ఎప్పుడో 500 సంవత్సరాల క్రితం జరిగిన కథని స్వల్పంగా కల్పితం చేసి చూపించే సినిమాలోని హింస దృశ్యాలకు స్పందిస్తున్న సమాజం.. కుంభమేళాలో తొక్కిసలాట, నిర్వహణ లోపం కారణంగా జరిగిన మరణాలను, ఆ తర్వాత ఆ శవాలను జెసిబిలతో ఎత్తివేయడాన్ని మాత్రం పట్టించుకోవడం లేదు. బ్రెయిడ్ డెడ్ సొసైటీ' అంటూ ఆమె ట్వీట్ చేశారు. దీనిపై కొందరు ఆమెకు మద్ధతు తెలుపుతుండగా.. మరికొందరు మాత్రం విమర్శల వర్షం కురిపిస్తున్నారు.

# కాంతార హీరోని టార్గెట్ చేయడం ఏమిటి




కవలం పదహారు కోట్ల బడ్జెట్ తో కాంతార తీసి మూడు వందల కోట్లు వసూలు చేసే బ్లాక్ బస్టర్ ఇచ్చాకే రిషబ్ శెట్టి అంటే ఏంటో ప్రపంచానికి తెలిసి వచ్చింది. కన్నడలో హిట్టయితే ఏదో అనుకోవచ్చు కానీ రెండు వారాల తర్వాత ఇతర భాషల్లో డబ్బింగ్ వెర్షన్లు రిలీజైతే అక్కడ కూడా ఘనవిజయం సాధించడం మాములు చరిత్ర కాదు. అందుకే కాంతార కొనసాగింపు చాప్టర్ 1 పేరుతో మరింత భారీగా తీస్తున్న రిషబ్ శెట్టి ప్రస్తుతం సోషల్ మీడియాలో చావా పుణ్యమాని హాట్ టాపిక్ గా మారాడు. కారణం 2027లో రిలీజ్ కాబోయే ఛత్రపతి శివాజీలో మరాఠా వీరుడిగా టైటిల్ రోల్ పోషిస్తున్నాడు కాబట్టి. నిజానికి దీని షూటింగ్ ఇంకా ప్రారంభం కాలేదు. అందుకే రెండేళ్ల తర్వాత రిలీజ్ డేట్ పెట్టుకున్నారు. కానీ కొందరు యాంటీ ఫ్యాన్స్ శివాజీ పాత్రకు రిషబ్ శెట్టి సూటవ్వడని, ప్రభాస్ లేదా రామ్ చరణ్ అయితే బాగుంటుందని ఏఐ టెక్నాలజీ వాడి ఫోటోలు వదలడం మొదలుపెట్టారు. అసలు మొదలే కానీ సినిమా మీద ఇలాంటి ప్రచారం జరగడం చూసి కన్నడ ఫ్యాన్స్ భగ్గుమంటున్నారు. శివాజీ రూపం కన్నా ఆయన పరాక్రమం, వీరత్వాన్ని తెరమీద పండించే నటుడు అవసరమని, అది రిషబ్ లో పుష్కలంగా ఉందనేది వాళ్ళ వాదన. ఎవరు రైట్ ఎవరు రాంగ్ అనేది పక్కనపెడితే ఈ డిబేట్లు ఆగడం లేదు. చావా పుణ్యమాని శంభాజీ,శివాజీ గురించి తెలుసుకుంటున్న యూత్ పెరిగిపోతోంది. వాళ్ళ గురించి ఆన్ లైన్ లో చదివి అవగాహన తెచ్చుకుంటున్నారు. చిన్నప్పుడు స్కూల్ పుస్తకాల్లో అక్బర్, షాజహాన్, బాబర్, టిప్పు సుల్తాన్ లను ఎక్కువ హైలైట్ చేశారు తప్పించి శివాజీ లాంటి వీరుల పాఠాలు ఎందుకు లేవని నిలదీస్తున్నారు.

# మాధవన్ చేతికి దొరికిన మిరాకిల్



సఖి, చెలి లాంటి సినిమాల ద్వారా తెలుగు ప్రేక్షకులకు మాధవన్ ఎప్పటి నుంచో సుపరిచితుడే. మధ్యలో కొంత గ్యాప్ వచ్చినట్టు అనిపించినా కొన్నేళ్లుగా తిరిగి ఫామ్ లోకి వచ్చేశాడు. విలన్ గానూ ఆకట్టుకుంటున్నాడు. నాగ చైతన్య సవ్యసాచి ఆడలేదు కానీ లేదంటే అందులో పెర్ఫార్మన్స్ కి మరిన్ని టాలీవుడ్ ఆఫర్లు క్యూ కట్టేవి. అజయ్ దేవగన్ సైతాన్ లో చేతబడి చేసే మాంత్రికుడిగా భయపెట్టిన మాధవన్ అంతకు ముందు రాకెట్రీ ది నంబి ఎఫెక్ట్ ద్వారా హీరోగా, దర్శకుడిగా ఒక నిజ జీవిత సైంటిస్ట్ కథను తెరమీద అద్భుతంగా ఆవిష్కరించాడు. తాజాగా మరో క్రేజీ సబ్జెక్టుని పట్టి ఇంకో బయోపిక్ తో వస్తున్నాడు. కోయంబత్తూర్ వాస్తవ్యులు గోపాలస్వామి దొరైస్వామి నాయుడు. ఈయన్ని ఎడిసన్ అఫ్ ఇండియా అని పిలిచేవారు. మన దేశంలో మొదటి ఎలెక్ట్రిక్ మోటార్ కనిపెట్టింది నాయుడే. తొలుత పారిశ్రామిక పరికరాలను కనుగొనడంలో తన ప్రతిభను చూపించడం మొదలుపెట్టి క్రమంగా ఆటోమొబైల్ లాంటి ఇతర రంగాలకు విస్తరింపజేశారు. పుట్టి పెరిగిన నగరానికి సంపద సృష్టించిన మేధావిగా జిడిఎన్ కు ఎన్నో పేరు ప్రఖ్యాతులున్నాయి. విచిత్రం ఏంటంటే ఒక రైతు కుటుంబలో పుట్టి చదువంటే ఆసక్తి లేక స్కూల్ కు దూరంగా ఉంటూ హొటల్ లో సర్వర్ గా జీవితాన్ని ప్రారంభించారు. స్కూటర్ కొనడం కోసం డబ్బు దాచుకునేవారు. మెకానిక్ గా మారాక స్వంతంగా ప్రయోగాలు చేయడం మొదలుపెట్టారు.

# హాలీవుడ్ రిపోర్టర్' పత్రికపై అల్లు అర్జున్




పుష్ప 2 ది రూల్ ప్రపంచవ్యాప్తంగా పద్దెనిమిది వందల కోట్లకు పైగా వసూలు చేయడం దగ్గరే దీని సంచలనాలు ఆగిపోలేదు. క్రికెట్ మ్యాచుల్లో విజేతలు మ్యానరిజం అనుకరించడం, ఇన్స్ టా రీల్స్ లో పాటలను ఇమిటేట్ చేయడం, బాలీవుడ్ జనాలు వెర్రెక్కిపోయి పుష్ప వేషధారణలో హల్చల్ చేయడం చాలానే చూశాం. కానీ ఇప్పుడు ఏకంగా హాలీవుడ్ మేగజైన్ దాకా అల్లు అర్జున్ ప్రభావం ఏ స్థాయిలో ఉందో చెప్పేందుకు మరో ఉదాహరణ తోడయ్యింది. ప్రముఖ అంతర్జాతీయ పత్రిక ది హాలీవుడ్ రిపోర్టర్ ఇండియన్ ఎడిషన్ తొలి పత్రిక ముఖ చిత్రంగా బన్నీ ఫోటోనే ప్రచురించడం ఖచ్చితంగా హిందీ స్టార్లకు మింగుడు పడని వ్యవహారమే. అంతే స్పెషల్ ఏముందో చూద్దాం. ది హాలీవుడ్ రిపోర్టర్ 1930 నుంచి డైలీ ట్రేడ్ పేపర్ గా విదేశాల్లో పేరుగాంచింది. 2010 నుంచి ప్రింట్ వెర్షన్ మొదలుపెట్టింది. 94 సంవత్సరాల క్రితం తొలి సంచిక వెలువడింది. అప్పటి నుంచి మీడియాలో తనదైన ముద్ర వేస్తూ కోట్లాది చదువరుల అభిమానాన్ని సొంతం చేసుకుంది. దీనికి ఆన్ లైన్ వెబ్ సైట్ కూడా ఉంది. ఇంత చరిత్ర కలిగిన ది హాలీవుడ్ రిపోర్టర్ మన దేశంలో అడుగు పెట్టింది. ఖరీదు మన వీక్లీ మ్యాగజైన్ లాగా అరవై డెబ్బై రూపాయలు కాదండోయ్. ఏకంగా 200 రూపాయలు వెచ్చిస్తే తప్ప దీన్ని కొనలేరు. సెన్సేషన్ జర్నలిజంలో హాలీవుడ్ రిపోర్టర్ కు బాగా పేరుంది. అయితే మన సినిమాలు, ఎంటర్ టైన్మెంట్ కు సంబంధించిన సమాచారం, కథనాలు మాత్రమే ఇండియన్ ప్రింట్ -వెబ్ ఎడిషన్ లో ఉంటాయి. మన దేశంలో ఇందరు స్టార్లు ఉండగా అల్లు అర్జున్ నే లాంచ్ ఇష్యూకి తీసుకోవడం మాములు విషయం కాదు. పుష్ప 2 ఎఫెక్ట్ ఎంత దూరం వెళ్లిందో దీన్ని బట్టి అర్థం చేసుకోవచ్చు.

TEL:T/TG/2024/0814
మన వెలుగు
ప్రతి వార్త ప్రజల వైపు తెలుగు దినపత్రిక
MANA VELUGU TELUGU DAILY



## ఉదయాన్నే ఈ టిప్స్ పాటిస్తే, మీ మైండ్ షార్ప్‌గా పనిచేస్తుందంట



మెదడు ఉత్తేజంగా పనిచేయడానికి ప్రతి రోజూ ఉదయాన్నే కొన్ని టిప్స్ పాటించాలంట. కొన్నిసార్లు మన మెదడు అలసిపోతుంది. దీంతో అసలు ఏపని సరిగా చేయాలనిపించదు. అందువలన మనం మార్నింగ్ లేచిన తర్వాత కొన్ని చిట్కాలు పాటించడం ద్వారా మన మెదడు పనితీరు మెరుగుపడి, జ్ఞాపకశక్తి పెరుగుతుందంట.మార్నింగ్ లేవగానే గ్లాస్ వాటర్ తాగాలంట. డీ హైడ్రేషన్ వలన మన మెదడు కాస్త మసకబారుతుంది. దీంతో మనకు ఎక్కువ ఆలోచనలు రావు. అందువల్ల, టీ లేదా కాఫీలు తాగడానికి ముందు తప్పకుండా నీరు తాగాలి అంటున్నారు నిపుణులు. అంతే కాకుండా ప్రతి రోజూ వ్యాయామం చేయడం వలన మనలో ఆత్మవిశ్వాసం పెరుగుతంది. మీర ముఖ్యంగా సూపర్ మ్యాన్ ఫోజ్ ఆసనం వేయాలంట. దీని వలన మన మెదడు పనితీరు మెరుగుపడుతుంది. అదేవిధంగా, టిఫిన్ చేయడానికి ముందు వాన్ నట్స్, బ్లూ బెర్రీలు, డార్క్ చాక్లెట్స్ తినడం కూడా ఆరోగ్యానికి మంచిదంట. ఇందులో యాంటీ ఆక్సిడెంట్స్, ఓమేగా 3 కొవ్వు ఆమ్లాలు పుష్కలంగా ఉండటం వలన దీని వలన జ్ఞాపకశక్తి పెరుగుతుంది. ఉదయం లేచిన తర్వాత ఒకసారి మీరు నిన్న చేసిన ఐదు పనులను వరుసగా గుర్తుచేసుకోవడం, ఒక చిన్న కోట్‌ను కంఠస్థం చేసుకుని, తర్వాత పునరావృతం చేయడం వలన మెదడు పనితీరు బాగుంటుంది. ఇలాంటి మానసిక వ్యాయామాలు నాడీ సంబంధాలను బలోపేతం చేస్తాయి. జ్ఞాపకశక్తి వేగాన్ని మెరుగుపరుస్తాయి. ఉదయం లేవగానే ముందుగా నవ్వండి. నవ్వడం వల్ల డోపమైన్ పెరుగుతుంది, ఇది జ్ఞాపకశక్తి, ప్రేరణను పెంచే న్యూరోట్రాన్స్మిటర్. మార్నింగ్ నవ్వడం వలన మన మైండ్ షార్ప్ గా పని చేస్తుంది అంటున్నారు నిపుణులు.

## మంచి సువాసన వెదజల్లే మొక్కలను ఇంట్లో ఎందుకు పెట్టుకోరు...?




మల్లెపూలు చూడటానికి ఎంతో అందంగా ఉంటాయి. అంతే కాకుండా ఇవి మంచి సువాసనను వెదజల్లుతాయి. చాలా మంది మహిళలు వీటిని ఎక్కువగా ఇష్టపడుతుంటారు. అయితే అంతగా ఇష్టపడే ఈ మల్లెపూల చెట్లను ఇంట్లో పెంచుకోవడానికి ఎవరూ ఆసక్తి చూపరు. చాలా మంది ఇంట్లో మనీ ఫ్లాంట్ లాంటి షోకేజ్ ట్రీస్ ను పెంచుకుంటుంటారు. కానీ సువాసన వెదజల్లే మల్లె చెట్టును పెంచుకోరు. అయితే దీనికి ఓ కారణం ఉన్నదంట. చాలా మంది ఇంట్లో మనీ ఫ్లాంట్ లాంటి షోకేజ్ ట్రీస్ ను పెంచుకుంటుంటారు. కానీ సువాసన వెదజల్లే మల్లె చెట్టును పెంచుకోరు. అయితే దీనికి ఓ కారణం ఉన్నదంట. మల్లె చెట్టు దరదృష్టాన్ని తెచ్చి పెడుతుంది అంటున్నారు పండితులు. మరీ ముఖ్యంగా ఈ చెట్టును తప్పుడు దిశలో నాటడం వలన ఇంట్లో అశాంతి నెలకొనడం, ఆర్థికసమస్యలు తలెత్తడం జరుగుతుందంట. అందుకే ఈ మొక్కను ఇంటి పరిసరాల్లో నాటేటప్పుడు ఉత్తరం, తూర్పు లేదా ఈశన్యంలో నాటాలంటున్నారు నిపుణులు.మల్లె మొక్కను ఇంటి లోపల పెట్టుకోవడం వలన అది ఇంటిలోని సంపదను నాశనం చేస్తుందంట. అంతే కాకుండా, దీనిని ఇంట్లో పెంచుకోవడం వలన అలెర్జీ వంటి సమస్యలు తలెత్తుతాయంట. మల్లె మొక్కను ఇంట్లో పెట్టుకోవడం వలన వీటి వాసనకు తేనెటీగలు ఇంట్లో దూరే అవకాశం ఉంది. దీంతో చిన్నపిల్లలను లేదా ఎవరినైనా ఇవి కుట్టే అవకాశం ఉన్నందున ఇంటిలోపల ఈ మొక్కను పెంచుకోరంట.

## అప్పుల భారంతో ఇబ్బంది పడుతున్నారా..?




అర్థిక సమస్యలు, అప్పుల భారంతో ఇబ్బంది పడుతున్నారా..? వాస్తు శాస్త్రం కొన్ని మార్పులను సూచిస్తుంది. ఇవి ఇంట్లో శుభ శక్తులను ఆహ్వానించి ఆర్థిక పురోగతికి దోహదం చేస్తాయని చెబుతున్నారు. కొన్ని మార్పులు ఇంట్లో చేయడం ద్వారా మంచివైబ్రేషన్లు పెరిగి సంపద రాక ఆస్కారం కలుగుతుంది. ఇంటి ప్రవేశద్వారం దగ్గర వేప లేదా మామిడి చెట్లు నాటడం, ఇంట్లో గంగాజలం చల్లడం, పసుపు ముద్దను దిండు కింద ఉంచడం వంటివి అదృష్టాన్ని పెంచుతాయి. మంగళవారం హనుమాన్ పూజ, ఇంటి వంటగదిని శుభ్రంగా ఉంచడం, నైరుతి దిశలో శ్రీమహావిష్ణువు చిత్రాన్ని ఉంచడం కూడా ఆర్థిక పురోగతికి దోహదం చేస్తాయి. ఇంట్లో సరైన మార్పులు చేసి సంపద, శ్రేయస్సు పొందండి. ఇంటి ప్రవేశద్వారం వద్ద చెట్లు నాటడం, ఇంటి గుమ్మానికి దగ్గరగా మామిడి, వేప లేదా అశోక చెట్లను పెంచడం శుభ ఫలితాలను ఇస్తుంది. వాస్తు ప్రకారం.. ఇవి ఇంట్లోకి నెగటివ్ ఎనర్జీ రాకుండా అడ్డుకుంటాయి. ప్రతి రోజు సాయంత్రం భగవంతుడిని పూజించినప్పుడు రాగి పాత్రలో గంగాజలాన్ని ఉంచాలి. ఆ తర్వాత ఇంటి నాలుగు మూలల్లో చల్లడం శుభం అని వాస్తు నిపుణులు చెబుతున్నారు. ఇంటి నిర్మాణ లోపాలు ఆర్థిక సమస్యలకు కారణమవుతాయి. ముఖ్యంగా మరుగుదొడ్డి తగినచోట లేకపోతే సమస్యలు ఎదురవుతాయి. ఇంటి ప్రధాన ద్వారం పైన మరుగుదొడ్డి నిర్మించకూడదు. హిందూ సంప్రదాయం ప్రకారం చీపురును లక్ష్మీదేవిగా భావిస్తారు. దీన్ని ఎప్పుడూ ఆగ్నేయ దిశలో ఉంచకూడదు. అలాగే చెత్త బుట్ట కూడా ఇంటి దక్షిణ-తూర్పు మూలలో పెట్టడం మంచి ఫలితాలను ఇవ్వదు. ఇంటి ఆగ్నేయ దిశలో ఎరుపు రంగు పువ్వుల మొక్కలు నాటడం వల్ల అప్పుల బాధలు తగ్గుతాయని వాస్తు నిపుణులు సూచిస్తున్నారు. ముఖ్యంగా మందారం, గులాబి మొక్కలను పెంచడం శుభప్రదంగా ఉంటుంది. ఇంటి నైరుతి దిశలో శ్రీమహావిష్ణువు చిత్రం ఉండాలి. లక్ష్మీదేవి ఆయన పాదాల వద్ద కూర్చుని ఉన్న చిత్రాన్ని పెట్టడం మరింత శుభప్రదంగా ఉంటుంది. వంటగది ఎప్పుడూ శుభ్రంగా ఉండాలి. ముఖ్యంగా ఇది అగ్ని మూలం కాబట్టి దాన్ని దక్షిణ-తూర్పు మూలలో ఏర్పాటు చేయడం వల్ల వ్యాపార లాభాలు, ధన ప్రవాహం పెరుగుతాయని నమ్ముతారు. పూజ గదిలో శివుడిని కుటుంబ సమేతంగా చూపించే ఫోటో ఉంచడం ద్వారా కుటుంబంలో కలహాలు తగ్గి, ఆర్థికంగా పురోగతి సాధించవచ్చని వాస్తు శాస్త్ర నిపుణులు చెబుతున్నారు. ఈ చిన్న చిన్న మార్పులు ఇంట్లో అమలు చేసేశుభ శక్తులు పెరిగి ఆర్థిక సమస్యలు తొలగిపోతాయని నమ్ముతారు.

## కీళ్ల నొప్పుల సమస్యలు ఉన్నాయా...?



కొన్నిసార్లు అకారణంగా కండరాల నొప్పి, నుదుటి మీద విపరీతంగా చెమట పట్టడం, జుట్టు విపరీతంగా రాలడం వంటి సమస్యలు వేధిస్తుంటాయి. ఇలా ఎందుకు జరుగుతుందో తెలియక తికమక పడిపోతుంటారు. నిజానికి ఈ సమస్యలు ఒంట్లో ముఖ్యమైన విటమిన్లు లోపించడం వల్ల జరుగుతుందని ఆరోగ్య నిపుణులు హెచ్చరిస్తున్నారు.. శరీరానికి విటమిన్ డి చాలా ముఖ్యం. అయితే కొందరిలో ఈ విటమిన్ వివిధ కారణాల వల్ల లోపిస్తుంది. విటమిన్ డి లోపం వల్ల గుండె సమస్యలు వస్తాయి. శరీరంలోని అన్ని అవయవాలు సక్రమంగా పనిచేయడానికి రోజుకు 20-40 ఎన్గ్రా/ఎశ్రీ విటమిన్ ణ అవసరం. దీని కంటే తక్కువ మొత్తం ఉంటే అది శరీరంలోని వివిధ అవయవాల పనితీరుకు అంతరాయం కలిగిస్తుంది. శరీరంలో విటమిన్ డి లోపిస్తు పలు లక్షణాల ద్వారా పసిగట్టవచ్చు. దీన్ని సకాలంలో అర్థం చేసుకుని, జాగ్రత్తగా ఉండటం ముఖ్యం. లేదంటే పెద్ద పెద్ద సమస్యలు దాడిచేస్తాయి. కండరాల నొప్పి విటమిన్ డి లోపం వల్ల తలెత్తుతుంది. చాలా మంది దీనిని అలసిపోయినట్లుగా భావించి నిర్లక్ష్యం చేస్తారు. ఒక్కోసారి అది కాకపోవచ్చు. తగినంత విశ్రాంతి తీసుకున్న తర్వాత కూడా ఈ సమస్య తగ్గకపోతే, వెంటనే జాగ్రత్తగా ఉండాలన్నమాట. వేసవిలో చెమట పట్టడం అసాధారణం కాదు. కానీ ఇతర సమయాల్లో కూడా మీ నుదిటిపై ఊహించని విధంగా చెమటలు పడటం జరిగితే మాత్రం అలర్ట్ అవ్వాల్సిందే. ఈ విటమిన్ సెరోటోనిన్ హార్మోన్ ఉత్పత్తికి, మెదడు సరైన పనితీరుకు చాలా అవసరం. ఈ హార్మోన్ మానసిక స్థితిని నియంత్రించడంలో సహాయపడుతుంది. విటమిన్ డి సరిపడా లేకపోవడం వల్ల మానసిక స్థితిలో మార్పులు, ఆందోళన, నిరాశ కూడా సంభవించవచ్చు. విటమిన్ డి సూర్యకాంతి నుండి లభిస్తుందని దాదాపు అందరికీ తెలుసు. రోజుకు 15-30 నిమిషాలు ఎండలో గడపడానికి ప్రయత్నించాలి. ఉదయం 7-10 గంటల మధ్య వచ్చే సూర్యరశ్మి ఇంకా మంచిది. అలాగే ఆహారంలో తగినంత మొత్తంలో విటమిన్ డి ఉన్న ఆహారాలను తీసుకోవాలి. అంటే చేపలు, పుట్టగొడుగులు, పాల ఉత్పత్తులు, గుడ్డు సొనలు, ధాన్యపు ఆహారాలు వంటివి. సమస్య సహజంగా పరిష్కారం కాకపోతే, తప్పకుండా వైద్యుడిని సంప్రదించాలి.

## ఐరన్ పాత్రల్లో వంట చేస్తున్నారా..?



ఐరన్ పాత్రలు వాడటం ఆరోగ్యపరంగా చాలా ప్రయోజనకరం. ఐరన్ లోపం ఉన్నవారికి ఇవి మంచి ప్రత్యామ్నాయంగా ఉంటాయి. ఐరన్ పాత్రల్లో వండిన ఆహారం శరీరానికి అవసరమైన ఐరన్ అందించడంతో పాటు హీమోగ్లోబిన్ స్థాయిని పెంచే అవకాశం ఉంటుంది. అయితే అన్ని రకాల ఆహార పదార్థాలను ఐరన్ పాత్రల్లో వండకూడదు. కొన్ని పదార్థాలు ఐరన్‌తో ప్రతిచర్యకు లోనై ఆహార రుచి, పోషకాలను మార్చే ప్రమాదం ఉంది. ప్రస్తుత రోజుల్లో అనేక మంది నాన్-స్టిక్ పాత్రలను అధికంగా ఉపయోగిస్తున్నారు. కానీ నాన్-స్టిక్ పాత్రల్లో వంట చేయడం వల్ల కొన్ని ఆరోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉంది. దీర్ఘకాలంగా నాన్-స్టిక్ పాత్రలు వాడడం శరీరానికి హానికరం అని నిపుణులు చెబుతున్నారు. అందుకే ఆరోగ్యకరమైన జీవనశైలిని అనుసరించాలనుకునే వారు మట్టి పాత్రలు, ఐరన్ పాత్రలు వంటివాటిని ఎక్కువగా ఉపయోగిస్తున్నారు. కానీ ఐరన్ పాత్రలు వాడేటప్పుడు కొన్ని జాగ్రత్తలు పాటించాలి. ముఖ్యంగా కొన్ని రకాల ఆహారాలను ఐరన్ పాత్రల్లో వండకూడదు. అవి ఏంటో ఇప్పుడు తెలుసుకుందాం. గుడ్లు ఐరన్ పాత్రల్లో వండినప్పుడు అవి పాత్రకు అతుక్కుపోతాయి. ఇది శుభ్రం చేయడానికి కష్టం అవ్వటమే కాకుండా వంటకం తినడానికి కూడా ఇబ్బంది కలిగించవచ్చు. కాబట్టి గుడ్లను ఐరన్ పాత్రల్లో వండకూడదు. టమాటా సహజంగా ఆమ్లతత్వం ఎక్కువగా కలిగి ఉంటుంది. ఐరన్ పాత్రల్లో ఎక్కువగా టమాటా వండితే ఇది ఐరన్‌తో ప్రతిచర్యకి లోనై ఆహారం రుచి మారిపోవచ్చు. అంతేకాదు కొన్ని ఆరోగ్య సమస్యలు కూడా తలెత్తే అవకాశం ఉంటుంది. ముఖ్యంగా అధిక ఐరన్ శాతం శరీరంలో నిల్వ ఉండి ఆరోగ్య సమస్యలకు దారి తీస్తుంది. పన్నీర్, పెరుగు, ఇతర పాల ఉత్పత్తులను ఐరన్ పాత్రల్లో వండకూడదు. ఇవి ఐరన్‌తో కలిసినప్పుడు రుచి పూర్తిగా మారిపోతుంది. అంతేకాదు పాల ఉత్పత్తులు ఐరన్ పాత్రల్లో వండినప్పుడు అవి రంగు మారి చూడడానికి బాగుండవు. చేపలు చాలా మెత్తగా ఉండటం వల్ల ఐరన్ పాత్రల్లో వండినప్పుడు అవి విరిగిపోవచ్చు. అలాగే ఐరన్ పాత్రలు వేడెక్కినప్పుడు చేపలలోని ప్రొటీన్ మార్పులకు లోనై వాటి రుచి, ఆకృతిని మార్చివేయవచ్చు.

## గోంగూర పచ్చడి పెడితే తిన్నవాళ్లందరూ ఫిదా అవ్వాల్సిందే..!



గోంగూర అంటేనే తెలుగువారికి నోరూరిపోతుంది. పచ్చడి, కూర, తొక్కు, నాన్‌వెజ్ వంటకాలు ఇలా గోంగూరతో ఏది చేసినా అద్భుతంగా ఉంటుంది. అందుకే చాలా మంది దీనిని ఆహారంలో భాగంగా చేసుకుంటారు. గోంగూరతో రకరకాల వంటలు చేసినా అందరికీ ఇష్టమైనది మాత్రం గోంగూర పచ్చడి. గోంగూర పచ్చడి రుచిని మరింత పెంచేందుకు ఇప్పుడు పండుమిర్చితో పచ్చడి ఎలా చేయాలో చూద్దాం. మార్కెట్లో పండుమిర్చి దొరుకుతున్నాయి. కాబట్టి ఈ పచ్చడి పెట్టుకుంటే రుచి అదిరిపోతుంది. నేను చెప్పే కొలతలతో చేస్తే సంవత్సరం పాటు నిల్వ ఉంటుంది. ఈ పచ్చడికి కావలసిన పదార్థాలు, తయారీ విధానం అన్నింటి గురించి ఇప్పుడు వివరంగా తెలుసుకుందాం.కావాల్సిన పదార్థాలు: పావు కేజీ పండు మిరపకాయలు, 400 గ్రాముల గోంగూర ఆకులు, 1 టేబుల్ స్పూన్ మెంతులు, 1 టీ స్పూన్ జీలకర్ర, పావు కప్పు ఆయిల్, 20 గ్రాముల చింతపండు, 75 గ్రాముల ఉప్పు, అర టీ స్పూన్ పసుపు, పావు కప్పు వెల్లుల్లి రెబ్బలు. తాలింపు కోసం కూడా కొన్నింటిని తీసి ముందే పక్కకు పెట్టుకోవాలి. అవేంటో ఇప్పుడు తెలుసుకుందాం. 6 టేబుల్? స్పూన్ల ఆయిల్, 1 టీ స్పూన్? ఆవాలు, 1 టీ స్పూన్? జీలకర్ర, 1 టీ స్పూన్? మినపప్పు, 1 టీ స్పూన్? పచ్చి శనగపప్పు, 3 ఎండు మిర్చి, 4 దంచిన వెల్లుల్లి రెబ్బలు, 2 రెమ్మలు కరివేపాకు, చిటికెడు ఇంగువ. చెప్పినవన్నీ కూడా జాగ్రత్తగా పక్కకు పెట్టేసుకోండి. పక్కకు పెట్టుకోకుండా డైరక్ట్ వంట స్టార్ట్ చేస్తే గందరగోళంగా ఉంటుంది. అందుకే ముందే ఇలా చేసుకోవడం వల్ల చాలా రిలాక్స్ డ్ గా చేసుకోవచ్చు. పచ్చడి కూడా మంచి టేస్ట్ తో వస్తుంది.తయారీ విధానం: ముందుగా పండు మిరపకాయలను శుభ్రంగా కడిగి, తడి లేకుండా పొడి క్లాత్?తో తుడుచుకోవాలి. తర్వాత తొడిమలు తీసేసి చిన్న చిన్న ముక్కలుగా కట్? చేసుకోవాలి. చింతపండులో కూడా గింజలు, పీచు లేకుండా శుభ్రంగా తీసేసి పక్కన పెట్టాలి. గోంగూరను కాడలు లేకుండా కేవలం ఆకులు మాత్రమే తీసుకుని శుభ్రంగా కడగాలి. ఆ తర్వాత ఓ మెత్తటి క్లాత్? మీద వేసి ఫ్యాన్? గాలికి రాత్రి మొత్తం ఆరబెట్టుకోవాలి. గోంగూర, పండు మిర్చిలో కొంచెం తేమ ఉన్నా పచ్చడి ఎక్కువ రోజుల నిల్వ ఉండదు. ఈ విషయం గుర్తుంచుకుని వాటిలో తేమ లేకుండా చూసుకోవాలి.స్టవ్ ఆన్ చేసి పాన్ పెట్టి మెంతులు వేసి దోరగా వేయించుకోవాలి. మెంతులు వేగుతున్నప్పుడు జీలకర్ర వేసి మరోసారి వేయించుకుని స్టవ్ ఆఫ్ చేసి పక్కన పెట్టాలి. పూర్తిగా చల్లారిన తర్వాత మిక్సీజార్‌లోకి వేసుకుని మెత్తని పొడి చేసి పక్కన ఉంచాలి. మరోసారి స్టవ్ ఆన్ చేసి పాన్ పెట్టి నూనె పోసుకోవాలి. నూనె కాగిన తర్వాత చింతపండు, గోంగూర ఆకులు వేసి కలుపుతూ తేమ లేకుండా మగ్గించుకోవాలి. నూనెలో గోంగూర బాగా మగ్గిన తర్వాత స్టవ్ ఆఫ్ చేసి పూర్తిగా చల్లార్చుకోవాలి. మిక్సీజార్ లోకి కట్ చేసిన పండుమిర్చి ముక్కలు, ఉప్పు, పసుపు, వెల్లుల్లి రెబ్బలు వేసి కచ్చాపచ్చాగా గ్రైండ్ చేసుకోవాలి. ఆ తర్వాత వేయించిన మెంతులు జీలకర్ర పొడి, పూర్తిగా చల్లారిన గోంగూర వేసి మరోసారి గ్రైండ్ చేసుకోవాలి. ఇలా గ్రైండ్ చేసుకున్న గోంగూర పచ్చడిని గాజు జార్‌లో పెట్టి ఫ్రిజ్‌లో స్టోర్ చేసుకుంటే సంవత్సరం వరకు నిల్వ ఉంటుంది. ఈ పచ్చడి ఎప్పుడు కావాలనుకుంటే అప్పుడు కొద్దిగా తాలింపు పెట్టుకోవచ్చు. లేదంటే పచ్చడి మొత్తాన్ని ఒకేసారి తాలింపు పెట్టుకున్నా నిల్వ ఉంటుంది. తాలింపు కోసం స్టవ్ ఆన్ చేసి పాన్ పెట్టి నూనె పోసుకోవాలి. నూనె కాగిన తర్వాత ఆవాలు, జీలకర్ర, మినపప్పు, పచ్చి శనగపప్పు వేసి ఫ్రై చేసుకోవాలి. ఆ తర్వాత ఎండుమిర్చి, దంచిన వెల్లుల్లి రెబ్బలు, కరివేపాకు వేసి మరోసారి ఫ్రై చేయాలి. చివరగా ఇంగువ వేసి కలిపి స్టవ్ ఆఫ్ చేయాలి. ఇందులోకి గోంగూర పచ్చడిని వేసి కలిపి పూర్తిగా చల్లారిన తర్వాత స్టోర్ చేసుకుంటే అద్భుతంగా ఉండే గోంగూర పండుమిర్చి పచ్చడి రెడీ. వేడి వేడి అన్నంలో నెయ్యితో ఈ పచ్చడిని తింటే అమృతమే. మీరూ ఓ సారి ట్రై చేయండి.

మన వెలుగు
MANA VELUGU TELUGU DAILY



# 19 రోజులపాటు ఫ్యాన్స్‌కు పండగే



ఛాంపియన్స్ ట్రోఫీ 8 సంవత్సరాల తర్వాత తిరిగి రాబోతోంది. 8 జట్ల మధ్య జరిగే ఈ టోర్నమెంట్ నేటినుంచి అంటే ఫిబ్రవరి 19 నుంచి ప్రారంభమవుతుంది. ఈ టోర్నమెంట్ 19 రోజుల పాటు కొనసాగుతుంది. ఇక్కడ ప్రపంచ వ్యాప్తంగా అభిమానులు ఎదరుచూసేది భారత్ వర్సెస్ పాకిస్తాన్ మ్యాచ్ కోసమే అనడంలో ఎలాంటి సందేహం లేదు. ఈ మ్యాచ్‌తోపాటు మరో 15 ఉత్కంఠ మ్యాచ్‌లను చూసే అవకాశం ఉంది. 2025 ఛాంపియన్స్ ట్రోఫీ ఫిబ్రవరి 19 నుంచి ప్రారంభం కానుంది. ఈ క్రికెట్ టోర్నమెంట్ 8 సంవత్సరాల తర్వాత తిరిగి రాబోతోంది. ఈ టోర్నమెంట్ చివరిసారిగా 2017 లో జరిగింది. ఇంగ్లాండ్ ఆతిథ్యమిచ్చిన ఈ టోర్నమెంట్ టైటిల్‌ను పాకిస్తాన్ గెలుచుకుంది. ఇప్పుడు దాదాపు 8 సంవత్సరాల తర్వాత, ఛాంపియన్స్ ట్రోఫీ పాకిస్తాన్ ఆతిథ్యంలో జరగనుంది. కానీ, ఈసారి ఈ టోర్నమెంట్ హైబ్రిడ్ మోడల్‌లో జరుగుతుంది. నిజానికి, బీసీసీఐ టీం ఇండియాను పాకిస్థాన్‌కు పంపలేదు. ఇటువంటి పరిస్థితిలో టీం ఇండియా తన అన్ని మ్యాచ్‌లను దుబాయ్‌లో ఆడుతుంది. ఇది కాకుండా, మిగిలిన జట్ల మ్యాచ్‌లు పాకిస్తాన్‌లో ఆడనున్నాయి. 2025 ఛాంపియన్స్ ట్రోఫీలో 8 జట్లు ఆడతాయి. వీటిలో భారతదేశం, పాకిస్తాన్, న్యూజిలాండ్, దక్షిణాఫ్రికా, ఆస్ట్రేలియా, బంగ్లాదేశ్, ఆఫ్ఘనిస్తాన్, ఇంగ్లాండ్ జట్లు ఉన్నాయి. ఈ 8 జట్లను 2 గ్రూపులుగా విభజించారు. గ్రూప్ ఎలో భారతదేశం, పాకిస్తాన్, బంగ్లాదేశ్, న్యూజిలాండ్ జట్లు ఉన్నాయి. కాగా, గ్రూప్ బిలో ఆఫ్ఘనిస్తాన్, ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్, దక్షిణాఫ్రికా జట్లు ఉన్నాయి. గ్రూప్ దశలో అన్ని జట్లు తమ గ్రూప్‌లోని జట్లతో ఒకసారి తలపడతాయి. ఆ తర్వాత రెండు గ్రూపుల నుంచి తలో 2 జట్లు సెమీ-ఫైనల్స్‌కు అర్హత సాధిస్తాయి. 2025 ఛాంపియన్స్ ట్రోఫీ సమయంలో, మొత్తం 4 స్టేడియాలలో మ్యాచ్‌లు జరుగుతాయి. ఇందులో పాకిస్తాన్ నుంచి 3 స్టేడియంలు, దుబాయ్ నుంచి 1 స్టేడియాన్ని ఎంపిక చేశారు. పాకిస్తాన్‌లో, కరాచీలోని నేషనల్ స్టేడియం, లాహోర్‌లోని గడాఫీ స్టేడియం, రావల్పిండిలోని రావల్పిండి క్రికెట్ స్టేడియంలో మ్యాచ్‌లు జరుగుతాయి. దుబాయ్‌లో, టీం ఇండియా తన అన్ని మ్యాచ్‌లను దుబాయ్ ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియంలో ఆడుతుంది. ఈ టోర్నమెంట్‌లో అన్ని మ్యాచ్‌లు భారత కాలమానం ప్రకారం మధ్యాహ్నం 2:30 గంటలకు ప్రారంభమవుతాయి. టాస్ మధ్యాహ్నం 2 గంటలకు జరుగుతుంది.

# దుబాయ్‌లో రో'హిట్' బీభత్సం



ఛాంపియన్స్ ట్రోఫీ 2025 ఫిబ్రవరి 19 నుంచి ప్రారంభం కానుంది. ఈ టోర్నమెంట్‌లో టీం ఇండియా ఫిబ్రవరి 20న తన తొలి మ్యాచ్ ఆడనుంది. అయితే, టీం ఇండియా ప్రతి మ్యాచ్ దుబాయ్‌లో జరుగుతుంది. అంతకు ముందు రోహిత్ శర్మ అభిమానులకు ఓ గుడ్ న్యూస్ వచ్చింది. ఈ న్యూస్ వింటే కచ్చితంగా రోహిత్ అభిమానులు ఎగిరి గంతేస్తారనడంలో ఎలాంటి సందేహం లేదు. క్రికెట్ ప్రపంచంలో రోహిత్ శర్మ హిట్ మ్యాన్‌గా పేరుగాంచాడు. ప్రతి ఫార్మాట్‌లో సిక్సర్లు కొట్టడంలో అతనికి పేరుంది. మైదానం ఏదైనా, బౌలర్ ఎవరైనా సరే, రోహిత్‌కు పట్టింపు లేదు. చెత్త బంతిని చూసిన వెంటనే, అతను దానిని బౌండరీ లైన్ దాటిస్తాడు. ఇప్పుడు రోహిత్ శర్మ ఛాంపియన్స్ ట్రోఫీలో కనిపిస్తున్నాడు. కానీ, అక్కడ భారత కెప్టెన్ హిట్‌మ్యాన్‌గా కాకుండా దుబాయ్ డాన్‌గా మైదానంలోకి ప్రవేశించేందుకు సిద్ధంగా ఉన్నాడు. ఇప్పుడు హిట్‌మ్యాన్‌ను దుబాయ్ డాన్ అని ఎందుకు పిలుస్తారోనని ఆలోచిస్తున్నారా? రోహిత్ శర్మను దుబాయ్ డాన్ అని పిలవడానికి అతిపెద్ద కారణం అతని బలమైన ఆటతీరు. దుబాయ్ మైదానంలో రోహిత్ శర్మ ఆధిపత్యం చెలాయిస్తున్నాడు. రోహిత్ బ్యాట్ దుబాయ్‌లో చాలా బాగా పనిచేస్తుంది. రోహిత్ గణాంకాలను చూస్తే ఆశ్చర్యపోతారు. దుబాయ్ ఇంటర్నేషనల్ స్టేడియంలో రోహిత్ శర్మ 105.66 సగటుతో 317 పరుగులు చేశాడు. ఈ మైదానంలో అతని బ్యాట్ 25 ఫోర్లు, 13 సిక్సర్లు కొట్టింది. రోహిత్ స్ట్రైక్ రేట్ కూడా 90 కంటే ఎక్కువ. అతను దుబాయ్‌లో ఒక సెంచరీ, రెండు అర్ధ సెంచరీలు సాధించాడు. దుబాయ్ పిచ్‌పై రోహిత్ గత 4 ఇన్నింగ్స్‌లలో 3 ఇన్నింగ్స్‌లలో యాభైకి పైగా సగటుతో పరుగులు చేశాడు. గొప్ప విషయం ఏమిటంటే ఈ ఆటగాడు ఆసియా కప్‌లోనే పాకిస్థాన్‌పై 111 పరుగుల అజేయ ఇన్నింగ్స్ ఆడాడు. రోహిత్ తన ఇన్నింగ్స్‌లో 4 సిక్సర్లు, 7 ఫోర్లు కొట్టాడు. ఈ మ్యాచ్‌లో టీం ఇండియా 9 వికెట్ల తేడాతో విజయం సాధించింది. రోహిత్‌తో పాటు శిఖర్ ధావన్ కూడా సెంచరీ సాధించాడు. దుబాయ్ పిచ్‌పై రోహిత్ బ్యాట్ పరుగుల వర్షం కురిపిస్తుందని స్పష్టంగా తెలుస్తుంది. ఛాంపియన్స్ ట్రోఫీలో ప్రత్యర్థి బౌలర్లకు ఇది అస్సలు శుభవార్త కాదు.

# అతను లేకపోవడం లోటే



ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ బుధవారం నుంచి ప్రారంభం కానుంది. ఈ టోర్నమెంట్‌లో భారత్ తొలి మ్యాచ్‌లో బంగ్లాదేశ్‌తో తలపడనుంది. అయితే ఈ టోర్నమెంట్‌లో భారత పేస్ బౌలర్ జస్ప్రీత్ బుమ్రా అందుబాటు లేకపోవడం జట్టుకు తీరని లోటే అని శిఖర్ ధవన్ అభిప్రాయపడ్డారు. గాయం కారణంగా బుమ్రా ఈ టోర్నమెంట్‌కి దూరమైన విషయం తెలిసిందే. అయితే బుమ్రా జట్టులో లేకపోయినా.. భారత్ జట్టు పటిష్టంగానే ఉందని.. ఈసారి ఫేవరేట్ అని ధవన్ పేర్కొన్నారు. 'బుమ్రా లేని లోటును భర్తీ చేయడం కష్టం. నా దృష్టిలో అతను ప్రపంచంలో అత్యుత్తమ బౌలర్. ఎలాంటి క్లిష్ట పరిస్థితుల్లో అయినా.. ప్రశాంతంగా ఉండే వ్యక్తి. ఐసీసీ టోర్నమెంట్‌లో అలా ఉండటం చాలా అవసరం. కానీ, ఇటీవలి ఫామ్ ప్రకారం ఈ టోర్నమెంట్‌లో భారత్‌యే ఫేవరేట్. ఓ వైపు అనుభవం కలిగిన ఆటగాళ్లు, మరోవైపు యువకులతో జట్టు పటిష్టంగా ఉంది. శుభ్‌మాన్ గిల్ రాణిస్తుండగా.. రోహిత్ శర్మ తిరిగి ఫామ్‌లోకి వచ్చాడు. ఏలాగూ విరాట్ కోహ్లీ ఉండనే ఉన్నాడు. కాబట్టి ఈ టోర్మమెంట్ టైటిల్‌ని అందుకొనే సత్తా భారత్‌కి ఉంది' అని ధవన్ అన్నారు.

# ఫేవరేట్‌గా బరిలోకి టీమిండియా




మినీ ప్రపంచకప్.. ఐసీసీ మెగా చాంపియన్ టోర్నీకి వేళయింది. మరికొన్ని గంటల్లో నువ్వా నేనా అనే రేంజ్‌లో మ్యాచ్ ఆరంభంకాబోతోంది. దుమ్ము దులిపేదెవరు.. దంచికొట్టేదెవరు.. ఫైనల్‌గా టోర్నీలో మీసం మెలేసేదెవరు? చాలా గ్యాప్ తర్వాత జరుగుతున్న ఈ ఎడిషన్‌పై ఎన్నో అంచనాలు ఉన్నాయి. ప్రతిష్టాత్మక టోర్నీ మ్యాచ్‌లు చూసేందుకు అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఎనిమిదేళ్ల గ్యాప్ తర్వాత అభిమానుల ముందుకొస్తోంది ప్రతిష్టాత్మక ఐసీసీ చాంపియన్ ట్రోఫీ. ఇవాళ్టి నుంచి జరిగే ట్రోఫీలో టీమిండియా ఫేవరేట్‌గా బరిలోకి దిగుతోంది. 12ఏళ్ల కిందట మెగా టోర్నీలో విజేతగా నిలిచింది భారత్. ఇప్పుడు మరోసారి టైటిల్ గెలవడమే టార్గెట్‌గా పెట్టుకుంది. అయితే అరబ్ గడ్డపై టీమిండియా అన్ని విభాగాల్లో సత్తా చాటాల్సిన అవసరం ఉంది. రోహిత్, కోహ్లీ, గిల్, శ్రేయస్, పాండ్యా, అక్షర్ పటేల్, జడేజాలతో బ్యాటింగ్ బలంగా కనిపిస్తోంది. కుల్దీప్, వరుణ్ చక్రవర్తి, వాషింగ్టన్ సుందర్‌ల రూపంలో నాణ్యమైన స్పిన్నర్లు ఉన్నారు. దుబాయ్ వికెట్లు స్పిన్‌కి అనుకూలిస్తే వీళ్లకు తిరుగుండదు. బ్యాటింగ్, స్పిన్ బాగానే ఉన్నా.. పేస్ బౌలింగ్‌లోనే ఇబ్బందులు కనిపిస్తున్నాయి. ముఖ్యంగా స్టార్ పేసర్ బుమ్రా లేకపోవడం టీమ్‌కి అతిపెద్ద లోటుగా కనిపిస్తోంది. షమీ, హర్షిత్ ఎలా రాణిస్తారన్నది కీలకంగా మారింది. పాక్ ఆతిథ్యం ఇస్తున్న ఈ టోర్నీలో విజేతగా నిలవాలని అన్ని జట్లు పట్టుదలగా ఉన్నాయి. అయితే కరాచీ స్టేడియంపై భారత జెండా లేకుండానే ప్రారంభ వేడుకలకి సిద్ధమైంది పాక్. ట్రోఫీలో ఆడే అన్ని దేశాల జాతీయ పతాకాలు స్టేడియంలో ఎగరవేయడం ఆనవాయితీ. భారత్ మినహా మిగతా దేశాల జెండాలు కనిపించాయి. ఈ పరిణామంపై పెద్ద ఎత్తున విమర్శలొచ్చాయి. మరోవైపు సొంత దేశంలో టోర్నీ జరుగుతుండటంతో కప్పు కొట్టేయాలని పాక్ ఉవ్విళ్లూరుతోంది. ఇందులో తప్పేం లేకపోయినా.. పాక్ ప్రధాని షరీఫ్ భారత్‌ను లక్ష్యంగా చేసుకుని కామెంట్లు చేయడం వివాదాస్పదంగా మారింది. చాంపియన్ ట్రోఫిని సొంతం చేసుకుంటే సరిపోదని.. చిరకాల ప్రత్యర్థి టీమిండియాను ఓడించాలన్నారు. ఇంత ఓవరాక్షన్ అవసరమా అంటూ దాయాదికి ఇచ్చిపడేశారు నెటిజన్స్. 2021 టీ20 వరల్డ్ కప్‌లో ఓటమి మినహా.. ఐసీసీ టోర్నీలో ఆడిన ప్రతీసారి టీమిండియానే గెలిచిందని గుర్తు చేస్తున్నారు. ఇక బంగ్లా కూడా కాస్త ఓవర్‌గానే రియాక్ట్ అయింది. పసి కూనలం అని లైట్ తీసుకోకండి.. ఈసారి కప్పు మాదేనని గొప్పలకు పోయింది. ఈ స్టేట్‌మెంట్‌పైనా సెటైర్ల వర్షం కురిసింది. ఇప్పటిదాకా చాంపియన్ ట్రోపి 8సార్లు జరిగింది. ఇది తొమ్మిదో ఎడిషన్. భారత్, ఆసీస్ టీమ్‌లు చెరో రెండుసార్లు టోర్నీ విజేతలుగా నిలిచాయి. ట్రోఫీ ప్రైజ్‌మనీ భారీగా పెంచింది ఐసీసీ. 2017లో చివరిసారిగా టోర్నీ జరిగినప్పటితో పోలిస్తే 53శాతం పెంచింది. దాదాపు 60కోట్ల ప్రైజ్‌మనీ అన్ని టీమ్‌లకు పంచనుంది. విన్నర్‌కి 20.8 కోట్లు.. రన్నరప్‌కి 10.4%ౌ% సెమీ ఫైనలిస్ట్సకి 5.2కోట్లు అందించనుంది. అలాగే చివరి ప్లేస్‌లో నిలిచిన టీమ్‌కి కూడా 1.22 కోట్లు ఇవ్వనుంది.

# నలుగురు ఆల్‌రౌండర్లతో టీమిండియా




9వ ఛాంపియన్స్ ట్రోఫీ పాకిస్తాన్ వేదికగా 19నుంచి ప్రారంభం కానుంది. పాకిస్తాన్‌లోని కరాచీ, లాహోర్, రావల్పిండి వేదికలుగా మ్యాచ్‌లు జరగనుండగా.. భారత్ ఆడే మ్యాచ్‌లన్నీ దుబారు వేదికగా జరగనున్నాయి. ఐసిసి టాప్-8 జట్ల మధ్య జరిగే ఈ సంగ్రామంలో టీమిండియా ఫేవరెట్‌గా బరిలోకి దిగుతోంది. గత ఏడాది వెస్టిండీస్-అమెరికా వేదికగా జరిగిన టి20 ప్రపంచకప్‌ను చేజిక్కించుకున్న టీమిండియా.. ఈ ఛాంపియన్స్ ట్రోఫీలోనూ అదే ఉత్సాహంగా బరిలోకి దిగుతోంది. గత టి20 ప్రపంచకప్ తర్వాత కోచ్ రాహుల్ ద్రావిడ్‌కి తోడు ఆ ఫార్మాట్ నుంచి కోహ్లి, రోహిత్ వైదొలిగారు. అనంతరం గౌతమ్ గంభీర్ హెడ్ కోచ్‌గా బాధ్యతలు స్వీకరించాడు. సుదీర్ఘకాలంగా వన్డేల్లో కొనసాగుతున్న కోహ్లి, రోహిత్‌లకు ఇదే చివరి ఛాంపియన్స్ కానున్న దృష్ట్యా టైటిల్ సాధిస్తే ఈ ఫార్మాట్‌కు గుడ్‌బై చెబుతారని అభిమానులు ఆకాంక్షిస్తున్నారు. ఇక గౌతమ్ గంభీర్ కోచ్‌గా బాధ్యతలు స్వీకరించిన తర్వాత భారతజట్టు ఒక్క ఐసిసి ట్రోఫీని ముద్దాడలేదు. ఐసిసి టాప్-8 ర్యాంక్ జట్ల మధ్య జరిగే ఛాంపియన్స్ ట్రోఫీలో ఆడే జట్లను రెండు గ్రూప్‌లుగా విభజించారు. గ్రూప్-ఎలో భారత్, పాకిస్తాన్, బంగ్లాదేశ్, న్యూజిలాండ్%ౌ% గ్రూప్-బిలో ఆస్ట్రేలియా, ఇంగ్లండ్, దక్షిణాఫ్రికా, ఆఫ్ఘనిస్తాన్ జట్లు ఉన్నాయి. గ్రూప్‌లో ప్రతి జట్టు మిగిలిన జట్లతో ఒక్కో మ్యాచ్‌లో తలపడిన తర్వాత టాప్-2లో ఉన్న రెండు జట్లు మాత్రమే సెమీస్‌కు చేరనున్న దృష్ట్యా ప్రతి మ్యాచ్ కీలకం కానుంది.

# అదొక పీడకల అంటూ ఎమోషనల్ కామెంట్స్

2009 లాహోర్ ఉగ్రదాడి పాకిస్తాన్ క్రికెట్‌ను తీవ్రంగా ప్రభావితం చేసింది. ఈ సంఘటన తర్వాత అంతర్జాతీయ జట్లు అక్కడ ఆడేందుకు సంకోచించాయి, దాంతో పాకిస్తాన్ హోమ్ మ్యాచ్‌లు ఖాజులో నిర్వహించాల్సి వచ్చింది. కానీ, 2019 తర్వాత దశల వారీగా అంతర్జాతీయ క్రికెట్ పాకిస్తాన్‌లో తిరిగి ప్రారంభమైంది. 2025 ఛాంపియన్స్ ట్రోఫీ విజయవంతంగా నిర్వహించడం ద్వారా, పాకిస్తాన్ భద్రతా ప్రమాణాలను ప్రపంచానికి నిరూపించుకోవాలని ప్రయత్నిస్తోంది. 2025 ఛాంపియన్స్ ట్రోఫీని విజయవంతంగా నిర్వహించేందుకు పాకిస్తాన్ సిద్ధమవుతోంది. 1996లో వన్డే వరల్డ్ కప్‌కు ఆతిథ్యం ఇచ్చిన తర్వాత, పాకిస్తాన్ ఇలాంటి ప్రతిష్టాత్మక ఐసిసి ఈవెంట్‌ను నిర్వహించడం ఇదే మొదటిసారి. అయితే, ఈ టోర్నమెంట్ కేవలం క్రికెట్ పరంగా మాత్రమే కాకుండా, పాకిస్తాన్ క్రికెట్ భద్రతపరంగా ప్రపంచవ్యాప్తంగా విశ్వాసాన్ని పెంచుకోవడానికి కూడా ఒక పెద్ద అవకాశం. ఈ నేపథ్యంలో, 2009లో లాహోర్‌లో జరిగిన శ్రీలంక జట్టుపై ఉగ్రదాడి మరలా చర్చనీయాంశమైంది. అప్పట్లో పాకిస్తాన్‌లోని క్రికెట్ వాతావరణాన్ని పూర్తిగా మార్చేసిన ఆ సంఘటనను తాజాగా పాకిస్తాన్ మాజీ కెప్టెన్ ఇంజమామ్-ఉల్-హక్ మరోసారి గుర్తు చేసుకున్నారు. 2009 మార్చి 3న, లాహోర్‌లో శ్రీలంక జట్టు బస్సుపై 12 మంది తీవ్రవాదులు మెరుపుదాడి జరిపారు. గడాఫీ స్టేడియం సమీపంలోని లిబర్టీ ట్రాఫిక్ సిగ్నల్ వద్ద జరిగిన ఈ దాడిలో అసాల్ట్ రైఫిళ్లు, గ్రెనేడ్‌లు, రాకెట్ లాంచర్లతో తీవ్రవాదులు దాడికి పాల్పడ్డారు. ఈ ఘాతుక ఘటనలో ఆరుగురు పోలీసులు, డ్రైవర్ సహా ఎనిమిది మంది మరణించగా, శ్రీలంక ఆటగాళ్లు కుమార సంగక్కర, అజంతా మెండిస్, తిలన్ సమరవీర, తరంగ పరణవితన, సురంగ లక్మల్, తిలిన తుషార గాయపడ్డారు. ఈ దాడి తర్వాత పాకిస్తాన్‌లో అంతర్జాతీయ క్రికెట్ పూర్తిగా ఆగిపోయింది. జట్లు భద్రతా కారణాల వల్ల పాకిస్తాన్ పర్యటనలకు రావడానికి వెనుకాడాయి. దీంతో, పాకిస్తాన్ జట్టు తమ హోమ్ సిరీస్‌లను యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లో ఆడాల్సి వచ్చింది.పాకిస్తాన్ ఛాంపియన్స్ ట్రోఫీకి సిద్ధమవుతుండగా, ఇంజమామ్ ఈ సంఘటనపై తన ఆవేదన వ్యక్తం చేశారు. "2009 ఘటనలు ఇప్పటికీ ఒక చెడ్డ కలలా అనిపిస్తున్నాయి. మాకు 10 సంవత్సరాలు శిక్ష విధించబడింది. మా క్రికెట్ వెనక్కి తగ్గింది" అని ఆయన అన్నారు."స్టార్స్ మైదానంలో ప్రత్యక్షంగా ఆడుతున్న దృశ్యాలను అభిమానులు చూడడం చాలా గొప్ప విషయం. కానీ 2009 ఘటన తర్వాత, పాకిస్తాన్ క్రికెట్ పూర్తిగా మూగబోయింది. ముఖ్యంగా పాకిస్తాన్-భారత్ మ్యాచ్‌లు అయితే ప్రపంచవ్యాప్తంగా క్రికెట్ అభిమానులకు ఉత్సాహాన్నిస్తాయి" అని ఇంజమామ్ తెలిపారు. దాదాపు 10 సంవత్సరాల పాటు పాకిస్తాన్‌లో అంతర్జాతీయ క్రికెట్ లేదు. కానీ, 2019 తర్వాత పాకిస్తాన్ దశల వారీగా అంతర్జాతీయ జట్లను ఆతిథ్యం ఇవ్వడం ప్రారంభించింది. శ్రీలంక, వెస్టిండీస్, దక్షిణాఫ్రికా, ఇంగ్లాండ్, న్యూజిలాండ్ జట్లు మళ్లీ పాకిస్తాన్‌లో ఆడటానికి వచ్చాయి. ఇప్పుడు, 2025 ఛాంపియన్స్ ట్రోఫీ ద్వారా పాకిస్తాన్ అంతర్జాతీయ క్రికెట్ వేదికగా తన స్థానాన్ని మరింత బలపరచుకోవాలనుకుంటోంది. ఐసిసి మెగా టోర్నమెంట్ నిర్వహించడం ద్వారా, పాకిస్తాన్ భద్రతా ప్రమాణాలను మరింత మెరుగుపరిచిందనే సంకేతాన్ని ప్రపంచానికి ఇచ్చే అవకాశం ఉంది. ఈ ఛాంపియన్స్ ట్రోఫీ కేవలం పాకిస్తాన్‌కే కాకుండా, అంతర్జాతీయ క్రికెట్ ప్రపంచానికి కూడా కీలకమైనది. గతంలో 1996 వన్డే వరల్డ్ కప్‌కు భారత్, శ్రీలంక, పాకిస్తాన్ కలిసి ఆతిథ్యం ఇచ్చాయి. ఆ తర్వాత 2009 ఉగ్రదాడి తర్వాత పాకిస్తాన్ తన హోమ్ గ్రౌండ్స్‌లో క్రికెట్ కోల్పోయింది.